

కిక్కు కూటమి





- మద్యం దుకాణాల కోసం ఎత్తుగడలు
- దరఖాస్తు ప్రక్రియ నుంచే ప్రయత్నాలు మొదలు
- భాగస్వామ్యం, నెలవారీ ముడుపులపై నేతల లీకులు
- తమ నియోజకవర్గ పరిధిలో తమ వారికే కావాలని పట్టు
- స్టేషన్ల వారీగా సిండికేట్ అవుతున్న నేతల ముఖ్య అనుచరులు

ఇంతకాలం ప్రభుత్వ ఆధ్వర్యంలో మద్యం వ్యాపారం జరగ్గా.. కూటమి ప్రభుత్వం దీనిని మార్చేసింది. గతంలో మాదిరిగానే ప్రైవేటు వ్యక్తులు మద్యం దుకాణాలు నిర్వహించేలా ప్రభుత్వం తాజాగా పాలసీని తీసుకొచ్చింది. దీంతో మద్యం దుకాణాలను దక్కించుకునేందుకు అటు వ్యాపారులతో పాటు కొత్తగా రాజకీయ నాయకులు కూడా రంగప్రవేశం చేసేందుకు సిద్ధమయ్యారు. మద్యం దరఖాస్తుల రుసుం రూ.2 లక్షలు కావడం అది తిరిగి రాకపోవడంతో ఆ భారం తగ్గించుకోవడానికి కొందరు సిండికేట్ అవుతున్నారు. ఇక నియోజకవర్గాల వారీగా ప్రజాప్రతినిధులు, కూటమి నేతలు కూడా మద్యం వ్యాపారాన్ని తమ ఆధీనంలోకి తీసుకునేందుకు దరఖాస్తు ప్రక్రియ నుంచి ప్రయత్నాలు మొదలుపెట్టారని సమాచారం. తమ పరిధిలో వ్యాపారం చేయాలంటే తాము చెప్పినట్లు జరగాలన్నట్లుగా కొందరు నేతలు లీకులు ఇస్తున్నారు. లాటరీలో షాపు ఎవరు దక్కించుకున్నా సరే తాము చెప్పిన వ్యక్తులను భాగస్వాములుగా చేర్చుకోవాలని లేదంటే నెలవారీ ముడుపులు చెల్లించాల్సిందేనని అనధికార ఆదేశాలు కూడా ఇస్తున్నట్లు సమాచారం. దరఖాస్తు రుసుం ద్వారా సాధ్యమైనంత ఎక్కువ ఆదాయాన్ని రాబట్టాలనే ఆలోచనలో ప్రభుత్వం ఉండగా దానికి సిండికేట్ అడ్డుకట్ట వేస్తుందని ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను బట్టి తెలుస్తోంది. నాణ్యమైన మద్యాన్ని తక్కువ ధరకు వినియోగదారులకు అందించడానికి ప్రభుత్వం కార్యాచరణ రూపొందించగా దానిని చేజిక్కించుకునేందుకు ఎక్కడికక్కడ నేతలు కూటమి కట్టేందుకు సిద్ధమవుతున్నట్లు సమాచారం.

బాపట్ల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): మద్యం షాపు దరఖాస్తు రుసుం రూ.2 లక్షలు కావడంతో భారం తగ్గించుకునేందుకు సిండికేటై లాటరీలో అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు ఎదురుచూసే వారు కొందరు.. ఇతరులు ఇక్కడ వ్యాపారం చేయడం కష్టమనే అధికార పార్టీ నేతల లీకులు.. లాటరీలో షాపు ఎవరికి దక్కినా తాము చెప్పిన వ్యక్తులను భాగస్వాములుగా చేర్చుకోవాలని ప్రజాప్రతినిధులు ఆదేశాలు.. అమ్మకాలను బట్టి దుకాణానికి రూ.20 లక్షల నుంచి 30 లక్షల వరకు ముట్టచెప్పాలని నేతల హెచ్చరికలు.. మా నియోజకవర్గ పరిధిలో దుకాణాలు మా అనుచరులకే.. బదిలీల సమయంలోనే అధికారులతో దుకాణాల విషయంలో నేతల ఒప్పందాలు.. ఇదీ గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల పరిధిలో మద్యం దుకాణాల విషయంలో జరుగుతున్న విన్యాసాలు. దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమై ఐదురోజులు గడిచింది. ఆఫ్‌లైన్‌లో బాపట్ల జిల్లా వ్యాప్తంగా వచ్చిన దరఖాస్తుల సంఖ్య 22కు మించలేదు. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో కూడా అంతగా స్పందనలేదు. చివరి మూడు రోజుల్లో దరఖాస్తులు వెల్లువెత్తే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తుండగా, నేతల తీరును బట్టి పెద్దగా దరఖాస్తులు వచ్చేలా లేవని తెలుస్తోంది. పరిమిత సంఖ్యలో ఆఫ్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులన్నీ కూడా చాలావరకు నేతల అనుచరులవే కావడం గమనార్హం. పైగా స్థానికత అంశంతో పాటు అనధికార వాటాలపై బయట పెద్ద ఎత్తున ప్రచారానికి తెరతీయడంతో వీటన్నింటినీ బేరీజు వేసుకుని చాలా మంది వెనకడుగు వేస్తున్నారని తెలుస్తోంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా



ఎక్కడివారైనా సరే మద్యం షాపులకు దరఖాస్తు చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించగా తొలుత చాలామంది ఆసక్తి చూపారు. కానీ మద్యం వ్యాపారంపై నేతలు దృష్టి సారించడం.. వారి అనుచరుల బెదిరింపులు.. నెలవారీ ముడుపులు తదితరాల నేపథ్యంలో చాలామంది వేచిచూసే ధోరణిలో ఉన్నట్లు సమాచారం. బుధవారం వరకు అమావాస్య ఉండగా ఇక నుంచి దరఖాస్తుల ప్రక్రియ వేగవంతం కానున్నట్లు తెలుస్తుంది.

స్థానికత అంశంతో బెదిరింపులు

మద్యం షాపులకు దరఖాస్తు చేసేవారిలో కూటమి నేతల అనుచరుల హడావిడే ఎక్కువగా ఉంది. ఫలానా నేత తరఫున తాము రంగంలోకి దిగామని వీరే లీకులిస్తూ, వేరే వారెవరైనా లాటరీలో షాపు దక్కించుకున్నా తమను భాగస్వాములుగా చేర్చుకోవాల్సిందేనన్న అనధికార ఆదేశాలను జారీ చేస్తున్నారు. స్థానికేతరులెవరైనా తమ ప్రాంతంలో షాపు దక్కించుకున్నా తమను కాదని వ్యాపారం చేసే పరిస్థితి ఉండదని పరోక్షంగా హెచ్చరికలు జారీ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ పరిస్థితి ఎక్కువగా బాపట్ల జిల్లా రేపల్లె నియోజకవర్గంతో పాటు గుంటూరు, పల్నాడు జిల్లాల పరిధిలో పలు నియోజకవర్గాల్లో ఉన్నట్లు సమాచారం. మరోవైపు షాపును బట్టి ఇప్పటికే నేతలకు అందే ముడుపుల మీద రేటు ఫిక్స్ చేసి వారి అనుచరుల చేత బయట ప్రచారం చేయిస్తున్నారు. ఈ వాటాలు కూడా రూ.20 లక్షల నుంచి రూ.30 లక్షల వరకు ఫిక్స్ చేసేశారని సమాచారం. బాపట్ల జిల్లా పరిధిలో ఓ కీలక నేత వాటాల విషయంలో తన పరిస్థితి ఏమిటని మిగిలిన నాయకుల దగ్గరకు ఇటీవలే తన ప్రతినిధిని పంపించి అడిగించడం గమనార్హం.

సహకరించాలనే సిఫార్సులు

కొత్తపాలసీ ప్రకారం బినామీ పేర్లతో దుకాణాలను దక్కించుకుని మద్యం వ్యాపారాన్ని తమ గుప్పిట్లో పెట్టుకోవాలని కూటమి నేతలు ఆలోచన చేస్తున్నారు. ఇందుకు సహకరించాలని ఎక్సైజ్‌శాఖలో కొంతమంది అధికారులకు ఇప్పటికే ఆయా నేతలు ప్రతిపాదనలు పంపినట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల బదిలీల్లో సిఫార్సు లేఖలు ఇచ్చిన సందర్భంలోనే ఈ ప్రతిపాదనను వారి ముందుంచారని చెబుతున్నారు. బదిలీల సమయంలోనే అస్మదీయులైన అధికారులను కీలక ప్రాంతాల్లో నియమించేలా నేతలు సిఫార్సు లేఖలు అందజేశారు. దుకాణాలు తమకు వచ్చేలా సహకరించాలని కూడా కొందరు షరతు విధించినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలోనే ముఖ్య నేతలు రంగ ప్రవేశం చేస్తున్నట్లు తెలుస్తుంది. గుంటూరు, పల్నాడు జిల్లాల్లో ఉన్న ప్రజా ప్రతినిధులు, ముఖ్య నేతలు మద్యం షాపులపై ఆసక్తి చూపుతూ బినామీ పేర్లతో టెండర్లను దాఖలు చేసేందుకు సిద్ధమయ్యారు.

ముందస్తు ఒప్పందాలు

సిండికేట్‌గా దరఖాస్తు చేస్తున్న వారు తర్వాత వ్యాపారంలో విభేదాలు రాకుండా ముందుగానే అగ్రిమెంట్ చేసుకుని రంగంలోకి దిగుతున్నారు. మరికొందరు దరఖాస్తుకి ముందుగానే ఆ ప్రాంతంలోని కీలకనేత వద్ద ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. లాటరీలో షాపు తగిలినా ఫిక్స్ చేసిన వాటా ముట్టచెబుతామని వికటిస్తే షాపు దక్కించుకున్న వారి సిండికేట్‌లో తమను భాగస్వామిని చేయాలని నేతలతో మరికొందరు ఒప్పందాలు చేసుకుంటున్నారు.

సిండికేటుగా సిద్ధం

మద్యం షాపు లైసెన్సును లాటరీలో దక్కించుకోవాలంటే దరఖాస్తు రుసుం రూ.2 లక్షలు.. అది నాన్ రిఫండబుల్ కావడంతో మద్యం వ్యాపారంపై ఆసక్తి చూపే వారు కూటమి కట్టి సిండికేట్‌గా దరఖాస్తు చేస్తున్నారు. లాటరీలో షాపు ఎవరికి వచ్చినా మిగిలిన వారంతా అందులో భాగస్వాములుగా ఉండేటట్లు ముందుగానే అగ్రిమెంట్లు చేసుకుని మరీ రంగంలోకి దిగుతున్నారు. ఇలా దరఖాస్తు చేస్తున్న వారిలో ఎక్కువ మంది గతంలో మద్యం వ్యాపారంలో అనుభవం ఉన్నవారితో పాటు ఈ రంగంలో అనుభవం లేని వారు కూడా కలిసి దరఖాస్తు చేసి అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమవుతున్నారు.



పెళ్లి సందడి

- మొదలైన వివాహ వేడుకలు
- ఆరునెలల పాటు మంచి ముహూర్తాలు
- ఉమ్మడి గుంటూరు జిల్లాలో 10 వేల కల్యాణాలు
- ఏడాదిగా వాయిదా పడుతూ వచ్చిన వివాహాలు

గుంటూరు సిటీ, అక్టోబరు 5: ఏడు నెలలుగా మూలన పడిన భాజాలు, భజంత్రీలు మోగనున్నాయి. ఫంక్షన్ హాళ్లు వివాహ వేడుకలకు సిద్ధమవుతున్నాయి. ఏడాదిగా ముహూర్తాలు లేక శుభ కార్యాలు వాయిదా వేసుకున్న వారికి వేద పండితుల నుంచి తీపి కబురు అందుతోంది. శుభకార్యాల్లో ప్రధానమైనవి పెళ్లిళ్లు. ఊరూవాడా పెళ్లిళ్ల సందళ్లు సంతరించుకుంటున్నాయి. సీతారాముల కల్యాణం చూతము రారండీ అనే కబుర్లు రానున్నాయి. వేలాది జంటలు ఒక్కటయ్యే శుభతరుణం రానేవచ్చేసింది. చాలా ఇళ్లలో పెళ్లి సందడి ప్రారంభమైంది. కల్యాణ మండపాలు పెళ్లి పందిళ్లతో ముస్తాబు కానున్నాయి. గత ఏడాది శుక్రమౌఢ్యమి, గురుమౌఢ్యమి, వాస్తు కత్తెర, శూన్య మాసాలతో సుమారు ఏడు నెలలు పాటు శుభ ముహూర్తాలు లేక వాయిదా పడుతూ వచ్చాయి. క్రోధినామ సంవత్సర ఆరంభంలో చైత్ర, వైశాఖ, జ్యేష్ఠ, శ్రావణ మాసాలలో బలమైన ముహూర్తాలు తక్కువగా ఉండటంతో చాలామంది వివాహాలు వాయిదా వేసుకున్నారు. ఈ క్రమంలో శుక్రవారం నుంచి వచ్చే సంవత్సరం మార్చి 16వ తేదీ వరకు వివాహ, శుభకార్యాలకు ముహూర్తాలు ఉన్నట్లు వేద పండితులు చెబుతున్నారు. ఈ ఆరు నెలల్లో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా సుమారు 10 వేల వరకు వివాహ వేడుకలు జరగనున్నట్లు సమాచారం. అక్టోబరులో ప్రారంభమైన ఆశ్వీయజమాసంతో పాటు కార్తీక, మార్గశిర, మాఘ, ఫాల్గుణ మాసాలలో బలమైన ముహూర్తాలు ఉండటంతో వివాహాలతో పాటు, అన్ని శుభకార్యాలు ఆరంభించుకునే అవకాశం ఏర్పడింది. కేవలం పెళ్లిళ్లకు మాత్రమే కాకుండా నూతనంగా గృహ నిర్మాణం చేసే వారికి శంకు స్థాపనలు, గృహ ప్రవేశాలు, ఉప నయనం వంటి వాటి కి ఇవి మం రోజులని పండితులు చెబుతున్నారు.



శుభ ముహూర్తాలు ఇలా..

- అక్టోబరు 4 శుక్రవారం నుంచి 26వ తేదీ శనివారం వరకు
- నవంబరు 3 ఆదివారం నుంచి 24వ తేదీ ఆదివారం వరకు
- డిసెంబరు 4వ తేదీ బుధవారం నుంచి 8వ తేదీ ఆదివారం వరకు
- 2025 జనవరి 30 గురువారం నుంచి ఫిబ్రవరి 22 శనివారం వరకు
- మార్చి 2 ఆదివారం నుంచి 16వ తేదీ ఆదివారం వరకు

వస్త్ర దుకాణాలు కళకళ

గుంటూరులోని ప్రముఖ వస్త్ర దుకాణాలు కొనుగోలుదారులతో కళకళలాడుతున్నాయి. దసరా పండుగ హడావుడి ఒకవైపు.. పెళ్లిళ్ల హడావుడి మరొకవైపు కనిపిస్తుంది. బంగారం షాపులు కూడా కస్టమర్లతో నిండిపోతున్నాయి. ఈ నెల ఆరంభం నుంచి వస్త్ర బంగారం షాపుల్లో కొనుగోళ్లు ఎక్కువైనట్లు వ్యాపారులు చెప్తున్నారు. వచ్చే ఆరు నెలల పాటు ఈ హడావిడి ఇలాగా ఉండవచ్చని దుకాణదారులు చెప్తున్నారు.

ముందే బుకింగ్..

వివాహాలు ఎక్కువగా ఉండటంతో ఉమ్మడి గుంటూరు జిల్లా వ్యాప్తంగా ప్రధాన పట్టణాల్లోని కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాల్స్ ముందు గానే బుక్ చేసుకుంటున్నారు. గుంటూరులో ఉన్న ప్రముఖ ఫంక్షన్ హాల్స్ రానున్న జనవరి వరకు ఖాళీ లేవని తెలిసింది. చిన్నా, చితక ఫంక్షన్ హాల్స్ ఖాళీ ఉన్నా అధిక ధరలు చెబుతున్నట్లు తెలుస్తోంది. అయినా వాటికి కూడా ముందుగానే అడ్వాన్స్ చెల్లిస్తున్నట్లు సమాచారం.

చాలా శ్రేష్ఠమైన రోజులు

గత సంవత్సరం అంతా శుభ ముహూర్తాలు లేక అనేక శుభ కార్యాలు చేసుకోవాలనుకునేవారు వాయిదా వేసుకున్నారు. వివాహాది శుభ కార్యక్రమాలు నిర్వహించుకోవడం కోసం ఎక్కువ మంది ఎదురుచూస్తున్నారు. వారికి ఇవి చాలా శ్రేష్ఠమైన రోజులు. అందువల్ల ఉభయ తెలుగు రాష్ట్రాల్లో సుమారు లక్ష వరకు వివాహాలు జరిగే అవకాశం ఉంది. వివాహాలకు మాత్ర మే కాకుండా, అన్నిరకాల శుభ కార్యాలు చేసుకోవచ్చు.



- జంధ్యాల వేంకటరామలింగేశ్వరశాస్త్రి, జ్యోతిష్య పండితులు

ప్రత్యేక డ్రైవ్‌లో గిరిజనులందరికీ ఆధార్

- జిల్లావ్యాప్తంగా వారం రోజులపాటు నిర్వహణ
- అధికారులకు కలెక్టర్ వెంకటమురళి ఆదేశాలు


బాపట్ల, అక్టోబరు 5: జిల్లాలో వారం రోజులపాటు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి గిరిజనులందరికీ ఆధార్‌కార్డులు ఇవ్వాలని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. ఆదివాసి దినోత్సవంలో చర్చించిన అంశాలపై శనివారం మండలస్థాయి అధికారులు అనుబంధ శాఖల జిల్లా అధికారులతో కలెక్టర్ వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాలంటే విధిగా ఆధార్‌కార్డులు ఉండాలన్నారు. ఈ నెల 8 నుంచి 15వ తేదీ వరకు ఆధార్‌కార్డుల జారీపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. అన్నిపంచాయతీలలో విస్తృత ప్రచారం చేయాలన్నారు. ఎస్టీల ఆవాస ప్రాంతంలో అధికారులు వీధి విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. జిల్లాలో 65 వేలమంది ఎస్టీలు ఉన్నట్లు, 42 ప్రాంతాల్లో అధికంగా ఉన్నట్లు ప్రాథమిక అంచనా వేశామన్నారు. పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలైన నేపథ్యంలో ఎస్టీకాలనీల్లో కనీస సదుపాయాలు కల్పించాలని చెప్పారు. ఇంటి స్థలాలు, రేషన్‌కార్డులు లేని ఎస్టీలను గుర్తించి తక్షణమే వారికి మేలు జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని చెప్పారు. 14 రోజుల్లో ఇంటిస్థలాలు లేని వారి వివరాలు, అవసరమైన భూమి వివరాలను ఇవ్వాలన్నారు. శ్మశానాలు లేని ప్రాంతాలను గుర్తించి భూమి కేటాయించాలన్నారు. బాపట్లలో సామాజిక భవనం ఏర్పాటుకు స్థలం గుర్తించాలని ఆర్డీవోను ఆదేశించారు. గిరిజనుల జీవనోపాధి మెరుగుపర్చడానికి 25 శాతం రుణసదుపాయం కల్పించాలన్నారు. చేపలవేటకు వెళ్తున్న 355 మంది ఎస్టీలను గుర్తించి సొసైటీలుగా ఏర్పాటు చేశామన్నారు. 50 ఏళ్లు దాటిన వారికి ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌కు తక్షణమే దరఖాస్తు చేయించాలన్నారు. జనన ధ్రువీకరణపత్రాల ప్రక్రియపై 9, 10 తేదీల్లో తహసీల్దార్లు పంచనామ నిర్వహించాలన్నారు. ప్రభుత్వ ఎస్టీ వసతి గృహాలను సక్రమంగా నిర్వహించాలన్నారు. సమావేశంలో జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి ప్రకాశరావు, తదితరులు పాల్గొన్నారు.



కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి

- 18వ విడత నిధులు విడుదల చేసిన ప్రధాని మోదీ
- గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లా రైతుల ఖాతాల్లో రూ.84.97 కోట్లు

పీఎం కిసాన్.. 4,24,872 మందికి లబ్ధి



బాపట్ల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి(పీఎం కిసాన్) పథకం కింద ఉమ్మడి గుంటూరు జిల్లాకు రూ.84.97 కోట్లు వచ్చాయి. ఈ మేరకు సదరు నిధులను ప్రధానమంత్రి నరేంద్రమోదీ శనివారం నేరుగా రైతుల ఖాతాలకు జమ చేశారు. 2019లో ప్రారంభించిన ఈ పథకం ద్వారా రైతులకు ఏడాదికి కేంద్ర ప్రభుత్వం రూ.6 వేలు మూడు విడతల్లో అందజేస్తుంది. పీఎం కిసాన్ పథకం ప్రారంభించిన తర్వాత 18వ విడత నిధులు విడుదల చేస్తున్నట్లు మోదీ ప్రకటించారు. ముందుగా చెప్పినట్లు ఒక్కో రైతు ఖాతాలో రూ.2 వేలు జమవుతుంది. ఈ పథకం కింద గుంటూరు జిల్లాలోని 86,674 మంది రైతులకు రూ.17.33 కోట్లు, పల్నాడు జిల్లాలో 1,97,639 మంది రైతులకు రూ.39.53 కోట్లు, బాపట్ల జిల్లాలో 1,40,559 మంది రైతులకు రూ.28.11 కోట్లు చొప్పున కేంద్రం జమ చేసింది. ఇప్పటికే ఈ-కేవైసీ పూర్తి చేసుకున్న రైతులకు నేరుగా నిధులు జమ అవుతాయని అధికారులు తెలిపారు. ఇంకా ఈ-కేవైసీ చేయించుకోని వారు వెంటనే చేయించుకోవాలని సూచించారు.

- పట్టా, డీకే భూములకు పెరిగిన గిరాకీ
- ప్రభుత్వ భూమి పక్కనున్న పట్టా భూములకు డిమాండ్
- ఇప్పటికే వాల్టా ఉల్లంఘించి యథేచ్ఛగా ఇసుక తవ్వకాలు

సెంటు.. రూ.లక్ష




ఓ ప్రాంతంలో జరుగుతున్న ఇసుక అక్రమ తవ్వకాలు

చీరాల, అక్టోబరు 5: పట్టా, డీకే భూముల్లో నిర్ణీత అనుమతులు పొంది, నిబంధనల మేరకు ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. దీంతో చీరాల నియోజకవర్గ పరిధిలో కొందరు పట్టా భూముల కొనుగోలుకు పోటీ పడుతున్నారు. దీంతో ఇసుక భూముల్లో సెంటు రూ.1 లక్ష, అంతకు పైగా పలుకుతోంది. ప్రభుత్వ భూముల పక్కనున్న పట్టా భూములకు మరింత గిరాకీ ఉంది. అనుమతులు పొందితే పట్టా భూములతో పాటు ప్రభుత్వ భూముల్లోనూ తవ్వకాలు సాగించవచ్చనే ఆలోచనతో పలువురు అడుగులు వేస్తున్నారు. ఇప్పటికే చీరాల నియోజకవర్గంలో వాల్టా నిబంధనలను పట్టించుకోవడం లేదు. దీంతో ప్రభుత్వ, ప్రైవేటు భూముల్లో ఆఖరుకు స్ట్రయిట్‌కట్ కరకట్టలను వదలకుండా అక్రమార్కులు ఇసుక అక్రమ తవ్వకాలు సాగిస్తున్నారు.

అనుమతులు లేకున్నా తవ్వకాలు

సుమారు రెండు దశాబ్దాల కిందట చీరాల, వేటపాలెం, చినగంజాం మండలాల పరిధిలో ప్రభుత్వ పరంగా ఇసుక తవ్వకాలకు నిబంధనల మేరకు కొందరికి అనుమతులు ఉన్నాయి. అయితే వేటపాలెం మండలానికి చెందిన ఓ వ్యక్తి వాల్టాను ఉల్లంఘిస్తూ ఎక్కువ లోతు వరకు ఇసుక తవ్వకాలు సాగిస్తున్నారని, భూగర్భ జలాలు అడుగంటుతున్నాయని కోర్టును ఆశ్రయించారు. ఆ క్రమంలో ఇసుక తవ్వకాలకు అనుమతులు నిలిపివేశారు. వేటపాలెం, చినగంజాం మండలాల పరిధిలో కొందరికి సిలికా లైసెన్సులు ఉన్నాయి. అందులో కొందరు సిలికా ముసుగులో సాధారణ ఇసుక రవాణా సాగిస్తున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అక్రమార్కులు పూర్తి స్థాయిలో దందా సాగించారు. ప్రస్తుతం పట్టా, భూముల్లో ఇసుక తవ్వకాలకు అనుమతులు పొంది ఆ వ్యాపారం చేసేందుకు పలువురు పోటీ పడుతున్నారు. అది కూడా రాజకీయ రంగు పులుముకుంటుంది.

అనుమతులు లేకుండా తవ్వకాలు నేరం



పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలకు ప్రభుత్వం మార్గదర్శకాలను విడుదల చేసింది. అయితే అనుమతులు లేకుండా ఇసుక తవ్వకాలు జరిపితే అది నేరం. దీన్ని గుర్తించి నడుచుకోవాలి. లేదంటే చర్యలు తప్పవు.

- దేవరకొండ అఖిల, ఆర్డీవో, చీరాల

ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు

మూడు రోజుల కిందట ప్రభుత్వం పట్టా భూముల్లో ఇసుక తవ్వకాలకు మార్గదర్శకాలతో జీవో విడుదల చేసింది. అయితే ఇప్పటి వరకు ఎవరు అనుమతులు పొందలేదు. ముందస్తుగా అనుమతుల కోసం కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకోవాలి. ఇప్పటి వరకు ఎవరికీ అనుమతులు ఇవ్వలేదు.

- రాజేష్, మైనింగ్ ఏడీ, బాపట్ల

పారదర్శకంగా సేవలందించాలి

- రెండు రోజుల్లో విచారణ కమిటీ తనిఖీ
- రాష్ట్ర ట్రెజరీ అండ్ అకౌంట్స్ డైరెక్టర్ మోహనరావు

చీరాల, అక్టోబరు 5: ఈ రోజు ఉద్యోగులం, రేపు మనం కూడా పెన్షనర్లమే అన్న విషయాన్ని అందరూ గుర్తెరిగి.. పారదర్శకంగా సేవలందించాలని రాష్ట్ర ట్రెజరీ అండ్ అకౌంట్స్ డైరెక్టర్ ఎన్.మోహనరావు తెలిపారు. శనివారం ఆయన సాధారణ తనిఖీల్లో భాగంగా చీరాల సబ్‌ట్రెజరీ కార్యాలయానికి వచ్చారు. ఎస్టీవో ప్రసాదరావు, ఇతర అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. ఇటీవల కార్యాలయ అధికారులు, సిబ్బందిపై వచ్చిన అవినీతి ఆరోపణలపై రెండు రోజుల్లో విచారణ కమిటీ వస్తుందన్నారు. వారు పూర్తి స్థాయిలో విచారణ జరుపుతారని చెప్పారు. అవినీతి ఆరోపణలు రుజువైతే చర్యలు పక్కాగా ఉంటాయన్నా రు. కార్యాలయం పై అంతస్తులో ఉండడంతో పనులపై వచ్చేవారు ఇబ్బంది పడుతున్నట్లు తమ పరిశీలనలో వెల్ల డైందన్నారు. కింది ఫ్లోర్‌లో సేవలం దేలా చర్యలు చేపట్టాలని ఎస్టీవోకు సూచించారు. ఈ సందర్భంగా ప లు దస్త్రాలను పరిశీలించారు.



ఉపఖజానా అధికారి సుబ్బారావుతో మాట్లాడుతున్న రాష్ట్ర ట్రెజరీ అండ్ అకౌంట్ డైరెక్టర్ మోహనరావు

రాజేంద్రప్రసాద్ ఇంట విషాదం

గుండెపోటుతో కూతురు గాయత్రి మృతి





సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ ఇంట విషాదం నెలకొంది. ఆయన కూతురు గాయత్రి (38) హఠాన్మరణమే ఇందుక్కారణం. శుక్రవారం రాత్రి ఛాతీలో నొప్పితో హైదరాబాద్‌లోని ఏఐజీ ఆస్పత్రిలో చేరిన ఆమె.. చికిత్స తీసుకుంటూ తుదిశ్వాస విడిచారు. మరణానికి కారణం గుండెపోటని డాక్టర్లు తెలిపారు. సినీ ప్రముఖులు చిరంజీవి, వెంకటేశ్, అల్లుఅర్జున్, సాయి కుమార్, ఎన్టీఆర్, త్రివిక్రమ్‌తో పాటు కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు, రాజేంద్రప్రసాద్‌ను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ సోషల్ మీడియా వేదికగా సంతాపం ప్రకటించారు.

కూతురిలో తల్లిని చూసుకుంటూ...

2018లో 'బేవర్స్' అనే సినిమా ప్రీ రిలీజ్ వేడుకలో భావోద్వేగానికి గురయ్యారు రాజేంద్ర ప్రసాద్. ఆ వేడుకలో ఆయన మాట్లాడుతూ "నా పదవ ఏట అమ్మను కోల్పోయాను. అమ్మ నన్ను వదిలివెళ్లడంతో తట్టుకోలేకపోయాను. నా జీవితమంతా అమ్మ లేని లోటు నన్ను వెంటాడుతూ ఉండేది. కానీ గాయత్రి పుట్టాక.. తనలోనే అమ్మను చూసుకున్నాను. కానీ ఇప్పుడు నాకు, నా కూతురికి మాటలు లేవు. నా అంగీకారం లేకుండానే తను ప్రేమించిన వ్యక్తిని పెళ్లి చేసుకుని వెళ్లిపోయింది. అప్పటి నుంచి తనతో మాట్లాడటం మానేశాను. ఈ సినిమా కోసం సుద్దాల అశోక్ తేజ రాసిన పాట 'తల్లీ తల్లీ నా చిట్టి తల్లి నా ప్రాణాలే పోయాయమ్మా.. నువ్వే లేని లోకాన నేను శవమల్లే మిగిలానమ్మా' విన్నాను. విన్న వెంటనే నా కళ్ల నిండా కన్నీళ్లొచ్చాయి. ఆ రోజు సాయంత్రం నా కూతురిని ఇంటికి పిలిపించి ఈ పాటను నాలుగు సార్లు తనకి వినిపించాను. ఆ పాట విన్నాక నా కూతురిపై కోపం పోయింది. అమ్మ చనిపోయినప్పుడు ఎలా అయితే ఏడ్చానో.. అలా ఏడ్చేశా" అని అన్నారు. కాగా, రాజేంద్రప్రసాద్‌కు తన కూతురు గాయత్రి అంటే పంచప్రాణాలు. ఈ మధ్యనే తనకు ఓ ఖరీదైన కారు, విలాసవంతమైన భవంతిని బహుమతిగా ఇచ్చారు. గాయత్రి న్యూట్రీషియనిస్ట్‌గా పనిచేసేవారు. కేపీహెచ్‌బీలోని తన భర్త రాజ్ కుమార్, కూతురు సాయితేజస్వినితో ఉండేవారు. సాయితేజస్విని 2018లో విడుదలైన 'మహానటి' సినిమాలో చిన్ననాటి సావిత్రి పాత్రతో బాలనటిగా వెండితెరపై అరంగేట్రం చేసింది. ఆ తర్వాత మూడు సినిమాల్లో నటించింది. కేపీహెచ్‌బీలోని ఇందు ఫార్చ్యూన్ ఫీల్డ్స్ విల్లా నెంబర్ 266లో ఉన్న రాజేంద్రప్రసాద్ నివాసానికి గాయత్రి పార్థీవ దేహాన్ని తీసుకొచ్చారు. అక్కడకు రాజకీయ సినీ ప్రముఖులు వచ్చి పార్థీవ దేహానికి నివాళులర్పించారు. కేపీహెచ్‌బీ ఏడో పేజ్‌లోని హిందూ స్మశాన వాటికలో నేడు ఉదయం పది గంటలకు అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



ఆకట్టుకునే నాన్న కథ



సుధీర్‌బాబు హీరోగా నటిస్తున్న కుటుంబ కథా చిత్రం 'మా నాన్న సూపర్ హీరో'. అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వంలో సునీల్ బలుసు నిర్మించారు. ఈ నెల 11న విడుదలవుతోంది. శుక్రవారం ఈ చిత్రం ట్రైలర్‌ను మహేశ్‌బాబు విడుదల చేసి, సినిమా ఘన విజయం సాధించాలని ఆకాంక్షించారు. కన్నతండ్రి, పెంచిన తండ్రి ప్రేమను పొందేందుకు కథానాయకుడికి ఎదురైన ఇబ్బందులు ఏమిటి?, ఆ సమస్యను అధిగమించేందుకు అతను ఎలాంటి సాహసోపేతమైన నిర్ణయం తీసుకున్నాడు అనే అంశం చుట్టూ ఆసక్తికరంగా అల్లుకున్న కథ అని ట్రైలర్‌ను బట్టి తెలుస్తోంది. ఇందులో ఆర్నా కథానాయికగా నటిస్తున్నారు. సాయిచంద్, షాయాజీ షిండే ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. సంగీతం: జై క్రిష్, సినిమాటోగ్రఫీ: సమీర్ కల్యాణి.

గద్దలకొండ... తరహాలో

వరుణ్‌తేజ్ కథానాయకుడిగా దర్శకుడు కరుణకుమార్ తెరకెక్కిస్తున్న పీరియాడిక్ చిత్రం 'మట్కా'. నవంబర్ 14న విడుదలవుతోంది. డాక్టర్ విజయేందర్‌రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మిస్తున్నారు. నోరా ఫతేహి,మీనాక్షి చౌదరి కథానాయికలు. నవీన్‌చంద్ర, అజయ్ ఘోష్ కీలకపాత్రలు పోషించారు. శనివారం చిత్రబృందం విజయవాడలోని రాజ్ యువరాజ్ థియేటర్‌లో 'మట్కా' టీజర్‌ను ఆవిష్కరించింది. నాలుగు విభిన్నమైన పాత్రల్లో వరుణ్‌తేజ్ మేకోవర్ ఆకట్టుకుంది. ఈ సందర్భంగా వరుణ్‌తేజ్ మాట్లాడుతూ 'నేను 'గద్దల కొండ గణేశ్' సినిమా చేశాక చాలా మంది 'మరోసారి అలాంటి సినిమా చేయండి'అని అడిగారు. 'మట్కా' కూడా అదే తరహాలో ఉండబోతోంది. నా కెరీర్‌లో గర్వపడే సినిమా అవుతుందని భావిస్తున్నాను' అని చెప్పారు. వరుణ్‌తేజ్‌ను ఇప్పటిదాకా చూడని సరికొత్త పాత్రలో చూడబోతున్నారు అని కరుణ కుమార్ చెప్పారు. ఇప్పటివరకూ ఒక లెక్క, ఇకపై వరుణ్ కటౌట్ మరోలెక్క అన్నట్లుగా సినిమా ఉండబోతోందని డా. విజయేందర్‌రెడ్డి చెప్పారు. ఈ చిత్రానికి జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: ఏ. కిశోర్ కుమార్

ఆ 30 నిముషాల ట్రైన్ ఎపిసోడ్ అలరిస్తుంది



గోపీచంద్ హీరోగా శ్రీను వైట్ల దర్శకత్వంలో రూపొందుతున్న 'విశ్వం' చిత్రం ఈ నెల 11న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో దర్శకుడు శ్రీను వైట్ల మీడియాతో మాట్లాడుతూ చిత్ర విశేషాలు వెల్లడించారు.

- గోపీచంద్‌తో సినిమా చేయాలని ఎప్పటినుంచో అనుకుంటున్నాం. ఆయన్ని దృష్టిలో పెట్టుకుని రాసిన కథ ఇది. ఆయనకు నచ్చి ఓకే చేశారు. నా శైలిలో రావాలని ఎనిమిది నెలలు టైమ్ తీసుకున్నా. అభిరుచి కలిగిన నిర్మాత టీజీ విశ్వప్రసాద్‌తో పాటు విశ్వప్రసాద్ కూడా జాయిన్ అవడంతో సినిమాకు మరింత బలం వచ్చింది. యాక్షన్, హిలేరియస్ ఎంటర్‌టైన్‌మెంట్, ఎమోషన్స్‌తో సినిమా ఉంటుంది. ఇందులో ఓ పాప పాత్ర కీలకంగా ఉంటుంది.
- దర్శకుడిగా నాకు గ్యాప్ వచ్చినా సినిమాలు చూస్తూ వస్తున్న మార్పులు గమనిస్తూనే ఉన్నా. నా శైలి గురించి సోషల్ మీడియాలో చర్చ జరుగుతూనే ఉంది. ఏదో ఒక చోట నా కంటెంట్ వస్తూనే ఉంది. థీమ్‌లు రిపీట్ అవుతున్నాయని అంటున్నారు. దాన్ని క్రాక్ చేయడానికి టైమ్ పడుతుంది.
- పదేళ్ల క్రితం హీరో తెలివితేటలతో ఏదైనా సాధించగలడనే కథలు వచ్చాయి. ఈ సినిమా అలా ఉండదు. ఒక బర్నింగ్ ఇష్యూ తీసుకుని వినోదాత్మకంగా చెప్పా. మేకింగ్ వైజ్ వినూత్నంగా ఉంటుంది. నాకు, గోపీకి ఫ్రెష్ ఫీల్మ్ అవుతుంది.
- ఈ సినిమాలోనూ ట్రైన్ ఎపిసోడ్ ఉంది. ట్రైన్ ఎపిసోడ్ అనగానే 'వెంకీ' సినిమాతో కంపేర్ చేస్తారని తెలుసు. కానీ దానికీ దీనికీ చాలా తేడా ఉంటుంది. 30 నిమిషాల పాటు వెన్నెల కిశోర్, గణేశ్, నరేశ్, కవిత, చమ్మక్ చంద్ర, షకలక శంకర్‌లతో ట్రైన్ జర్నీ బాగుంటుంది.
- విశ్వం అనే పాత్ర జర్నీ ఈ చిత్రం. ఎమోషనల్ యాక్షన్ సినిమా అని చెప్పవచ్చు. జర్నీలో విశ్వానికి ఎలాంటి వ్యక్తులు కలిశారు, ఆ విషయాలు ఏమిటి అనేవి ఆసక్తికరంగా ఉంటుంది. కంటెంట్ స్ట్రాంగ్‌గా ఉంటేనే థియేటర్‌కు ప్రేక్షకులు వస్తున్నారు. ఆడియన్స్ కూడా వెంకీ తరహా సినిమాలు మిస్ అవుతున్నాయని అంటున్నారు. అందుకే కేర్ తీసుకుని ఈ సినిమా చేశా.

జాతీయ పురస్కారం రద్దు



మహిళా కొరియోగ్రాఫర్‌పై అత్యాచారం కేసులో పోక్సో చట్టం కింద అరెస్టయిన టాలీవుడ్ కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌కు మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆయనకు అందించాల్సిన జాతీయ అవార్డును రద్దు చేస్తూ కేంద్ర ప్రభుత్వం శనివారం నిర్ణయం తీసుకొన్నది. ఈ నెల 8న ఢిల్లీలో జరగనున్న జాతీయ అవార్డుల ప్రధానోత్సవంలో జానీ మాస్టర్ ఉత్తమ కొరియోగ్రాఫర్‌గా అవార్డును అందుకోవాల్సి ఉంది. 2022 సంవత్సరానికి గాను తమిళ చిత్రం 'తిరుచిత్రంబలం'కు గాను ఆయనకు ఈ పురస్కారం లభించింది. దీంతో ఆ వేడుకలకు హాజరయ్యేందుకు ఆయన బెయిల్ కోరగా రంగారెడ్డి కోర్టు మంజూరు చేసింది. కానీ అత్యాచారం కేసులో అరెస్టవడంతో కేంద్ర ప్రభుత్వం ఆయనకు ఇవ్వాల్సిన పురస్కారాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించింది.



అలరించే హంగులతో...

శ్రద్ధాదాస్, అజయ్, మాస్టర్ మహేంద్రన్ ప్రధాన తారాగణంగా రూపొందిన చిత్రం 'త్రికాల'. 'స్క్రిప్ట్ ఆఫ్ గాడ్' అనేది ట్యాగ్‌లైన్. మణి తెల్లగూటి దర్శకత్వంలో రాధికా శ్రీనివాస్ నిర్మించారు. త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం టైటిల్ పోస్టర్‌ను నిర్మాత దిల్‌రాజు ఆవిష్కరించి యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పురాణాల స్ఫూర్తితో రాసుకున్న కథ ఇది, ఈతరం ప్రేక్షకులను అలరించేలా అన్ని హంగులతో తెరకెక్కించాం అని దర్శకుడు తెలిపారు. సరికొత్త సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను అందించే చిత్రమిదని నిర్మాత చెప్పారు. సంగీతం: హర్షవర్ధన్ రామేశ్వర్, సినిమాటోగ్రఫీ: పవన్ చెన్నా

22 ఏళ్ల తర్వాత...



క్రియేటివ్ డైరెక్టర్ కృష్ణవంశీ దర్శకత్వంలో రవితేజ, శ్రీకాంత్, ప్రకాశ్‌రాజ్, సోనాలిబింద్రే నటించిన చిత్రం 'ఖడ్గం' రీ రిలీజ్‌కు సిద్ధమైంది. సినిమా విడుదలైన 22 ఏళ్లకు రీ రిలీజ్ అవుతుండడంతో చిత్రబృందం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా దర్శకులు కృష్ణవంశీ మాట్లాడుతూ "భారతీయ జెండా ఒక ఖడ్గం అనే ఉద్దేశం వచ్చేలా ఈ సినిమాకు టైటిల్ పెట్టాం. ఇన్నేళ్ల తర్వాత రీ రిలీజ్ అవుతుండడంతో చాలా సంతోషంగా ఉంది" అని చెప్పారు.

ఇన్ ప్రోగ్రెస్

మాస్ పాత్రలో తొలిసారి



వెంకట్ హీరోగా నటించిన 'హరుడు' చిత్రం గ్లింప్స్ శనివారం విడుదల చేశారు. రాజ్ తాళ్లూరి దర్శకత్వంలో డాక్టర్ ప్రవీణ్‌రెడ్డి నిర్మించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్మాత మాట్లాడుతూ 'ఈ సినిమా కోసం దర్శకుడు రాత్రింబవళ్లు కృషి చేశారు. సినిమాలోని పాటలు ఆదరణ పొందుతాయి' అన్నారు. కథ విన్న ఐదు నిముషాల్లో ఓకే చేసిన నిర్మాతకు దర్శకుడు కృతజ్ఞతలు తెలిపారు. వెంకట్ ఐదేళ్ల జర్నీ ఉందనీ, ఆయన ఇందులో మాస్ హీరోగా నటించారని చెప్పారు. హీరో వెంకట్ మాట్లాడుతూ 'కమర్షియల్ ఎలిమెంట్స్ కలిగిన మాస్ చిత్రం ఇది. షూటింగ్‌తో పాటు 60 శాతం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు కూడా పూర్తయ్యాయి. ఇందులో తొలిసారిగా మాస్ పాత్ర చేశాను. నా పాత్రకు దీటుగా హెబ్బా పటేల్ పాత్ర ఉంటుంది. నటాషాసింగ్ మరో పాత్ర చేసింది. సలోని స్పెషల్ సాంగ్ చేసింది' అని చెప్పారు.

టైమ్ ట్రావెల్ మూవీ



సాయిరోనక్, అమృత చౌదరి జంటగా నటించిన 'రివైండ్' చిత్రం ఈ నెల 18న విడుదల కానుంది. ఎన్నారై కల్యాణ్ చక్రవర్తి స్వీయ దర్శకత్వంలో ఈ సినిమా నిర్మించారు. శనివారం విడుదల చేసిన ట్రైలర్ రిలీజ్ ఈవెంట్‌లో హీరో మాట్లాడుతూ 'మంచి కంటెంట్ ఉంటే కచ్చితంగా ప్రేక్షకులు ఆదరిస్తారు. అందుకే మంచి కథను ఎన్నుకుని మాకున్న బడ్జెట్‌లోనే సినిమా తీశాం. మా దర్శకుడు కల్యాణ్ ఎన్నారై అయినా ఇక్కడికి వచ్చి డబ్బు పెట్టి మంచి కథతో సినిమా తీయడం అభినందనీయం' అన్నారు. 'ఆదరణ ఉంటుందని మేం కూడా టైమ్ ట్రావెల్ కథను ఎన్నుకొని ఆసక్తికరంగా చిత్రాన్ని రూపొందించాం. ప్రేక్షకులకునచ్చుతుందని మా నమ్మకం' అని చెప్పారు దర్శకనిర్మాత కల్యాణ్.

ఉత్సాహంగా యూటీఎఫ్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు

గుంటూరు(విద్య), అక్టోబరు 5: యూటీఎఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయిలో గుంటూరులో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల క్రీడా పోటీలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు పోటీలను రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎస్.వెంకటేశ్వర్లు, కేఎస్ ప్రసాద్, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తదితరులు ప్రారంభించి పోటీల్లో గెలిచిన విజేతలకు సర్టిఫికెట్లు అందజేశారు. రెండో రోజు ఎన్టీఆర్ స్టేడియంలో షటిల్,క్యారమ్స్, జావలిన్‌త్రో, క్రికెట్, వాకింగ్, రన్నింగ్, షాట్‌పుట్ తదితర పోటీల్లో ఉపాధ్యాయులు ఉత్సాహంగా పాల్గొన్నారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి నైతిక విలువల్ని పెంపొందించడం మాత్రమే కాదనీ, ఉపాధ్యాయులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలని సంఘ నాయకులు సూచించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు బి.ఆదిలక్ష్మి, ఎం.కళాధర్ పాల్గొన్నారు.



షటిల్ పోటీల్లో ఉపాధ్యాయులు

50 ఎంయూల విద్యుదుత్పత్తి

రెంటచింతల, అక్టోబరు 5: నాగార్జునసాగర్ టెయిల్ పాండ్ విద్యుత్ ప్రాజెక్టులో రెండు యూనిట్ల ద్వారా శుక్రవారం అర్ధరాత్రి 12 గంటల వరకు 50 రోజుల్లో 50 మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసినట్లు ఎస్ఈ కె.వెంకట రమణ చెప్పారు. శనివారం అతిథి గృహంలో ఏర్పాటైన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2025 మార్చి 31 నాటికి 78 ఎంయూల విద్యుదుత్పత్తి చేయాలన్నది లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు తెలిపారు. శనివారం ప్రాజెక్టుకు చెందిన మూడు రేడియల్ క్రస్ట్ గేట్లను 1.5 మీటర్ల మేర ఎత్తి 21,258 క్యూసెక్కులు, టీఆర్‌సీ ద్వారా 8,581 క్యూసెక్కులు మొత్తంగా 29,839 క్యూసెక్కుల నీటిని పులిచింతలకు విడుదల చేస్తున్నామన్నారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో 75.50 మీటర్ల మేర నీరుండగా ఈ నీరు 7.080 టీఎంసీలకు సమానమన్నారు. ఈఈ సుబ్రహ్మణ్యం, డీఈ నాగరాజు, ఏడీఈ రత్తయ్య, మహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి లోకేశ్ సారథ్యంలో క్రీడా హబ్‌గా మంగళగిరి

● పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య

మంగళగిరి సిటీ, అక్టోబరు 5: మంత్రి నారా లోకేశ్ సారథ్యంలో మంగళగిరి క్రీడలకు కేంద్రంగా మారబోతుందని ఏపీ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్ధయ్య అన్నారు. రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ సహకారంతో ఈ నెల 9 నుంచి 12వ తేదీ వరకు ప్రైడ్ ఆఫ్ మంగళగిరి పేరిట రాష్ట్ర స్థాయి పురుషులు, మహిళల కబడ్డీ పోటీలు జరగనున్నాయి. పట్టణంలోని గౌతమబుద్ధ రోడ్డు బీఎండబ్ల్యూ షోరూమ్ పక్కన గల మైదానంలో ఈ పోటీలు జరుగుతాయి. కబడ్డీ లీగ్ పోస్టర్లను మంగళగిరి టీడీపీ కార్యాలయంలో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అబద్ధయ్య మాట్లాడుతూ మంగళగిరి నియోజకవర్గాన్ని క్రీడా హబ్‌గా మార్చాలన్న లక్ష్యంతో మంత్రి లోకేశ్ తన సొంత ఖర్చులతో ప్రతియేటా వివిధ రకాల టోర్నీలు నిర్వహిస్తున్నారని చెప్పారు. టీడీపీ గుంటూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ నాలుగు రోజులపాటు జరిగే కబడ్డీ లీగ్‌లో రాష్ట్ర వ్యాప్తంగా 13 జిల్లాల నుంచి 300 మంది క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. పురుషులు, మహిళలకు వేర్వేరుగా పోటీలు, బహుమతులు ఉంటాయన్నారు. ప్రథమ బహుమతిగా రూ.లక్ష, ద్వితీయ బహుమతిగా రూ.75 వేలు, తృతీయ బహుమతిగా రూ.50 వేలు అందజేయనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనేందుకు ఎలాంటి ప్రవేశ రుసుము లేదన్నారు. టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి తమ్మిశెట్టి జానకీదేవి, పట్టణ అధ్యక్షుడు దామర్ల రాజు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ డైరెక్టర్ తోట పార్థసారథి, నేతలు వల్లభనేని వెంకట్రావు, అమరా సుబ్బారావు, గోవాడ దుర్గారావు, షేక్ రియాజ్, మల్లవరపు వెంకట్, పడవల మహేష్, రాయపూడి కిరణ్, కొప్పుల మధు, అబ్దుల్ మజీద్, వాకా మంగారావు, షేక్ నజీర్ పాల్గొన్నారు.



కబడ్డీ లీగ్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న అబద్ధయ్య, టీడీపీ నేతలు

వైసీపీ విధానాలతో విద్యా వ్యవస్థ నిర్వీర్యం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అశోక్‌బాబు

గుంటూరు(విద్య), అక్టోబరు 5: అస్తవ్యస్తమైన విద్యా వ్యవస్థను ఉపాధ్యాయుల సమష్టి కృషితోనే గాడిలో పెట్టడం సాధ్యమౌతుందని ఎమ్మెల్సీ పి.అశోక్‌బాబు అన్నారు. శనివారం గుంటూరు ఎన్జీవో హోమ్‌లో జరిగిన నోబుల్ టీచర్స్ అసోసియేషన్ (ఎన్‌టీఏ) రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఎమ్మెల్సీ అశోక్‌బాబు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం విద్యా రంగాన్ని నిర్వీర్యం చేసిందని అన్నారు. నాడు నేడు పనులు ప్రస్తుతం ఇంకా అసంపూర్తిగానే ఉన్నాయని, జీవో నం. 117, 84తో ప్రాథమిక పాఠశాలలు నిర్వీర్యం అయ్యాయని చెప్పారు. వీటిని రద్దు చేయడానికి ఎన్‌డీఏ ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. రాష్ట్రంలో 11,354 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయనీ, దీనికి కారణం గత వైసీపీ విధానాలేనని దుయ్యబట్టారు. ఎన్‌టీఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.హైమారావు మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేస్తామని ఇచ్చిన హామీని గత ప్రభుత్వం నిలబెట్టుకోలేదని అన్నారు. ప్రస్తుత ఎన్‌డీఏ ప్రభుత్వం జీవో నం.117, 84 రద్దు కోసం కృషి చేయడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎం. రెడ్డి రమేష్, ఆర్థిక కార్యదర్శి జె.శ్రీనివాస్, అసోసియేషన్ అధ్యక్షురాలు సీహెచ్ పద్మావతి, బీవీ నాగేశ్వరరావు, బి.నరేంద్ర కుమార్, వి.శారద, డి.శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

చదువుల తల్లికి సాయం చేస్తా

● తెలుగు యువత నేత వల్లూరి సంజీవ్
● 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

గుంటూరు, అక్టోబరు 5: తెలంగాణ రాష్ట్రం, ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం దిద్దుకూడికి చెందిన శ్రీహర్షిత ఇటీవల నీట్‌లో ర్యాంకు సాధించి మెడికల్ కళాశాలలో చేరేందుకు చిల్లిగవ్వ లేని పరిస్థితుల్లో ఆమెకు ఆర్థిక సాయం అందించేందుకు గుంటూరు నగరానికి చెందిన తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి సంజీవ్ (చిన్ని) ముందుకొచ్చారు. పానం శ్రీహర్షిత చిన్ననాటి నుంచే డాక్టర్ కావాలన్న కోరికతో చదువుకుని మంచి ర్యాంకు సాధించి వనపర్తి వైద్య కళాశాలలో సీటు దక్కించుకుంది. శ్రీహర్షిత తల్లి పదేళ్ల క్రితమే మృతి చెందటం, తండ్రి ఉన్నా పట్టించుకోకపోవటంతో ఆమె అమ్మమ్మ, తాతయ్యల వద్దే ఉంటూ చదువుకుంటోంది. మెడికల్ కళాశాలలో చేరేందుకు ఆర్థిక ఇబ్బందులతో తల్లడిల్లిపోతున్న ఆమె దీనావస్థపై 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి'లో ప్రసారమైన కథనానికి గుంటూరులోని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి సంజీవ్ స్పందించారు. వెంటనే సదరు విద్యార్థినితో ఫోన్‌లో మాట్లాడారు. తక్షణ సాయంగా రూ.50 వేలు, కావాల్సిన పుస్తకాలు అందిస్తానని విద్యార్థినికి భరోసా ఇచ్చారు. అలాగే రాబోయే నాలుగేళ్లలో ఆర్థిక సాయం, కావాల్సిన పుస్తకాలు అందిస్తానని తెలిపారు. ఇప్పటికే ఏపీలో ఐటీ, విద్యాశాఖ మంత్రిగా ఉన్న నారా లోకేశ్ విద్యార్థులకు అండగా నిలుస్తోన్న తరుణంలో ఆయన స్ఫూర్తితో తాము కూడా పేద విద్యార్థినికి అండగా నిలుస్తానని స్పష్టం చేశారు.

యార్డు కేసులో స్టేట్‌మెంట్ రికార్డు ప్రక్రియ ప్రారంభం

గుంటూరు, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వ హయాంలో మిర్చియార్డులో జరిగిన అవినీతి, అక్రమాలపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం జరుపుతున్న విచారణలో మాజీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ వాంగ్మూలం కీలకం కానుంది. యార్డులో జీరో బిజినెస్, మచ్చుకాయల దోపిడీ, రేట్ కటింగ్ సర్వసాధారణంగా జరుగుతుంటాయని ఇప్పటికే ఆయన బహిరంగంగా మాట్లాడారు. తన హయాంలో జరిగిన విషయాలన్నింటిని విజిలెన్స్ అధికారులకు వివరిస్తానని చెబుతున్నారు. మచ్చుకాయలు తీయడం నిలిపేయడంతో అప్పట్లో కొంతమంది వైసీపీ నేతలు వెనకుండి కార్మికులను ముందుకు ఎగదోసి రాజనారాయణ ఆఫీసు, వాహనంపై దాడికి దిగేలా చేశారు. ఈ విషయాలన్నింటిని ఆయన విజిలెన్స్‌కు నివేదించనున్నారు. ఎక్కడెక్కడ యార్డు ఆదాయానికి గండి పడుతుందో కూడా చెబుతానంటున్నారు. మిర్చియార్డులో అవినీతిపై విచారణ జరుపుతున్న విజిలెన్స్ ప్రాంతీయ కార్యాలయం గతంలో పని చేసిన చైర్మన్లు, సెక్రటరీలు, ఇతర సిబ్బందిని తమ వద్దకు పిలిపించుకుని స్టేట్‌మెంట్‌లు రికార్డులు చేసే ప్రక్రియని ప్రారంభించింది. వైసీపీ హయాంలో బాధ్యతలు నిర్వహించిన చైర్మన్‌లను రావాలని రెండు రోజుల క్రితమే పిలిచినప్పటికీ వారు కొన్ని కారణాలు చూపిస్తూ వచ్చే వారం వస్తామని నోటీసులకు సమాధానాలు పంపారు. లైసెన్సుల రెన్యువల్స్, పార్టనర్‌షిప్ డీడ్‌ల మార్పు ఎక్కువ సంఖ్యలో అప్పటి చైర్మన్ సుధాకర్‌రెడ్డి హయాంలో జరిగాయి. ఈ నేపథ్యంలో ఆయన ఏమి స్టేట్‌మెంట్ విజిలెన్స్‌కు ఇస్తారనేది చర్చనీయాంశంగా మారింది.

దుగ్గిరాలపైనా విజిలెన్స్ ఆరా..

దుగ్గిరాల మార్కెట్ కమిటీ యార్డు సందర్శనకు టీడీపీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలో ప్రస్తుత మంత్రి నారా లోకేష్ వెళ్లారు. ఆయన్ని యార్డులోనికి అనుమతించకుండా అప్పటి అధికారులు గేట్లకు తాళాలు వేశారు. వారంతా నేటికీ అదేయార్డులో కొనసాగుతున్నారు. వారిపై గుంటూరు యార్డులో పని చేసినప్పుడు ఈ-నామ్‌లో జరిగిన అక్రమాలపై పెద్దఎత్తున అవినీతి ఆరోపణలు వచ్చాయి. దుగ్గిరాలలో కోల్డ్‌స్టోరేజ్‌లో అగ్నిప్రమాదం జరిగినప్పుడు అధికారుల నిర్లక్ష్యం అడుగడుగునా కనిపించింది. నేటికీ ఆ స్టోరేజ్‌లో పంట ఉత్పత్తులు నిల్వ చేసుకొని నష్టపోయిన రైతులకు పరిహారం అందలేదు. వీటన్నింటి పైనా విజిలెన్స్ ఆరా తీయనున్నది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	128, 138,148
చికెన్ విత్ స్కిన్	240.00
చికెన్ స్కిన్ లెస్	250.00

బీటెక్ విద్యార్థిని ఆత్మహత్య

గుంటూరు, అక్టోబరు 5: స్థానిక పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని గుజ్జనగుండ్లకు చెందిన బీటెక్ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడింది. షేక్ సుఫియా(19) అనే యువతి ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతుంది. తండ్రి హుస్సేన్ వలి ఎలక్ట్రిసిటీ పని చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం సుఫియా ఫోన్‌లో ఎవరితోనో మాట్లాడుతుండడంతో ఎప్పుడూ ఎందుకు ఫోన్లు మాట్లాడుతున్నావు అంటూ తండ్రి మందలించి సెల్‌ఫోన్ లాక్కున్నాడు. మధ్యాహ్నం భోజనం చేసిన అనంతరం తండ్రి బయటికి వెళ్లాడు. సుమారు మూడు గంటల సమయంలో సుఫియా చెల్లెలు ఇంటికి రాగా తలుపు లోపల గడియ పెట్టి ఉంది. ఎంత కొట్టినా తీయకపోవడంతో కిటికీలో నుంచి చూడగా ఆమె ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. వెంటనే కుటుంబ సభ్యులు కిందకిదించి ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా, పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. తండ్రి హుస్సేన్ వలి ఫిర్యాదు మేరకు పట్టాభిపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాలువలో గుర్తుతెలియని యువకుడి మృతదేహం

గుంటూరు, అక్టోబరు 5 : స్థానిక లాలాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఏటుకూరు రోడ్డు కమ్యూనిస్టు బొమ్మలు సెంటర్ సమీపంలోని కాలువలో గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యమైంది. కాలువ నుంచి వాసన వస్తుండటంతో స్థానికులు గమనించి లాలాపేట పోలీసులకు సమాచారం అందించారు. లాలాపేట సీఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని కాలువపై రక్షణగా ఏర్పాటు చేసిన నాపరాళ్లను తొలగించి మృతదేహాన్ని వెలికి తీయించారు. మృతుని వయస్సు సుమారు 40 సంవత్సరాలు ఉంటుందని పోలీసులు చెబుతున్నారు. మృతుడు గడ్డం కలిగి ఉన్నాడు. శరీరం ఉబ్బి బాగా కుళ్లిపోయి గుర్తుపట్టలేని విధంగా ఉంది. శరీరంపై అంబేడ్కర్ బొమ్మ ఉంది. భీమ్ భారత్ అను పేరుతో నీలం రంగు టీ-షర్టు, కాటన్ ప్యాంటు ఉంది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శివప్రసాద్ తెలిపారు.

నాగార్జున సాగర్ నీటి సమాచారం

మాచర్ల రూరల్, అక్టోబరు 5: నాగార్జున సాగర్ జలాశయం నీటిమట్టం శనివారం నాటికి 588.20 అడుగులు ఉంది. ఇది 306.69 టీఎంసీలకు సమానం. కుడి కాలువ ద్వారా 10,350 క్యూసెక్కులు, ఎడమ కాలువ ద్వారా 8896 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,029 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 2400 క్యూసెక్కులు, ఎల్ఎల్‌సీ 600 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 51,275 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 51,275 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె




కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీని సత్కరించి పుష్పగుచ్ఛంతో అభినందిస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ, ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్

కార్పొరేషన్ చైర్మన్‌లకు ఎంపీ, ఎమ్మెల్యే అభినందనలు

బాపట్ల, అక్టోబరు 5 : రాష్ట్రంలోని వివిధ కార్పొరేషన్ చైర్మన్‌లుగా నియమితులైన వారిని శనివారం బాపట్ల ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్, ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మలు కలిసి అభినందనలు తెలిపారు. ఏపీఐఐసీ చైర్మన్ మంతెన రామరాజు, ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ, మారిటైమ్‌బోర్డు చైర్మన్ దామచర్ల సత్యలను ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించి పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా నూకసాని బాలాజీని ఎంపీ తెన్నేటి కృష్ణప్రసాద్ విజయవాడ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. పార్టీ కోసం పనిచేసిన వారికి సీఎం చంద్రబాబు సముచిత స్థానం కల్పించి మంచి పదవులిచ్చారని వాటిని సమర్థవంతంగా, బాధ్యతగా నిర్వహించి ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

బాపట్ల మున్సిపల్ కమిషనర్ బదిలీ

● ఆకస్మిక బదిలీ నేపథ్యంలో సర్వత్రా చర్చ

బాపట్ల, అక్టోబరు 5 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్ బదిలీపై వెళ్ళినట్లు తెలుస్తోంది. దీనికి సంబంధించి అధికారిక ఉత్తర్వులు నేడు, రేపో వెలువడనున్నాయి. కూటమి ప్రభుత్వం కొలువు దీరిన నెలన్నర తర్వాత బాపట్ల మున్సిపల్ కమిషనర్‌గా నిర్మల్‌కుమార్ బాధ్యతలు చేపట్టారు. ఇటీవల అక్రమ లేఅవుట్‌లను బహిరంగ పరిచే విషయంలో ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రభుత్వం విధానపరమైన నిర్ణయం తీసుకుంది. ఈ వివరాలను వెల్లడించే క్రమంలో బాపట్ల మున్సిపాలిటీ పరిధిలోని అనధికార లేఅవుట్‌ల విషయంలో పేర్లతో సహా జాబితా ప్రచురించడాన్ని రియల్టర్లు ఆక్షేపించారు. దీనికి తోడు కార్పొరేట్ సిఎస్ఆర్ ఫండ్ కింద లే అవుట్‌ల యజమానులకు నిధుల సేకరణ కోసం సమావేశం ఏర్పాటు చేశారని ప్రచారం కూడా జరిగింది. ఈ వివాదం నడుస్తుండగానే మున్సిపాలిటీలో అవినీతి జరుగుతుందని సాక్షాత్తు బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్సీ అన్నం సతీష్‌ప్రభాకర్ ఆరోపించారు. దీనికి కొనసాగింపుగా ఎమ్మెల్యే నరేంద్రవర్మ మున్సిపాలిటీలో మధ్యవర్తుల పేరిట డబ్బులు వసూలు చేయడం నిజమేనని వాటిని తిరిగి ఇప్పించానని చెప్పడం మున్సిపాలిటీ చుట్టు ముసురుకున్న ఆరోపణలకు బలం చేకూరినట్టు అయ్యింది. ఈ అవినీతి పర్వం నడుస్తున్నప్పుడే కమిషనర్ బదిలీ తథ్యం అనే చర్చ అప్పట్లో నడిచింది. కాని వివాదం సద్దుమణిగింది అనుకున్న తరుణంలో కమిషనర్ బదిలీపై వెళ్ళడం బాపట్లలో చర్చనీయాశం అయ్యింది. ఇదిలాఉంటే కేంద్ర సర్వీసులో భాగమైన నిర్మల్‌కుమార్ డిప్యుటేషన్‌పై బాపట్ల మున్సిపల్ కమిషనర్‌గా వచ్చారని ఇలా విధులు నిర్వహిస్తున్న వారందరిని తిరిగి వెనక్కి పిలిచే క్రమంలోనే ఈ బదిలీ జరిగింది తప్ప అప్పట్లో వచ్చిన ఆరోపణలకు ఈ బదిలీకి సంబంధం లేదనే వాదన అధికారులు చెబుతున్నారు. ప్రొద్దుటూరు మున్సిపల్ కమిషనర్ రామశ్రీనాథ్‌రెడ్డి బాపట్లకు వచ్చే అవకాశముందని చెబుతున్నారు.

మాతృమరణాలు జరగకుండా చర్యలు చేపట్టాలి

బాపట్ల, అక్టోబరు 5 : జిల్లాలో మాతృ మరణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.విజయమ్మ తెలిపారు. ఈ విషయమై డీఎంఅండ్ హెచ్‌వో కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ వెల్లటూరు, ఇంకొల్లు ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల పరిధిలో రెండు మాతృ మరణాలు జరిగాయని వాటిపై సమీక్షించి కారణాలను విశ్లేషించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, డాక్టర్ రామకృష్ణ, హనుమాన్, డాక్టర్ శేషుకుమారి, డాక్టర్ సునీత, డాక్టర్ రోహిణి, డాక్టర్ దీప, డాక్టర్ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమాన్ని వినియోగించుకోవాలి

బాపట్ల, అక్టోబరు 5 : ఎమ్మెల్సీ ఓటు నమోదు కార్యక్రమాన్ని గ్రాడ్యుయేట్స్ సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ పార్లమెంట్ మహిళా ప్రధాన కార్యదర్శి పల్లం సరోజినీ తెలిపారు. శనివారం ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమ పరిధిలో ఏర్పాటు చేసిన కేంద్రాల వద్ద ఓటు నమోదు చేయించుకోవాలన్నారు.

దళిత, గిరిజన కుటుంబాలకు ఆర్థిక భరోసా : అల్లాడి

బాపట్ల, అక్టోబరు 5 : దళిత గిరిజన కుటుంబాలకు ఆర్థికపరమైన, ఆరోగ్యపరమైన తోడ్పాటుకు కొల్లూరు, భట్టిప్రోలు మండలాలలో కోటిరూపాయలు వెచ్చించి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు దళిత బహుజన రీసోర్స్ సెంటర్ ఎగ్జిక్యూటివ్ కార్యదర్శి అల్లాడి దేవకుమార్ వివరించారు. బృంద సభ్యులతో కలిసి శనివారం కలెక్టర్ జె.వెంకటమురళికి వినతిపత్రం అందజేసి వారు అందిస్తున్న సేవలను వివరించారు. ఇటీవల సంభవించిన వరద సమయంలో కొల్లూరు, భట్టిప్రోలు మండలాలలో 5 వేల కుటుంబాల వారికి నిత్యావసరాలు అందజేసినట్లు చెప్పారు. వారి సేవలను కలెక్టర్ జె.వెంకటమురళి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ డిప్యూటీ డైరెక్టర్ సీహెచ్ శామ్యూల్, అనీల్ కుమార్, రీసెర్చ్ సెల్ డిప్యూటీ డైరెక్టర్ ఉమామహేశ్వరరావు, ట్రైనింగ్ కో ఆర్డినేటర్ హేమలత, ఏరియా కోఆర్డినేటర్ వి.భగవాన్‌దాసు పాల్గొన్నారు.

వంటసాల నిర్మాణానికి దాతల ఆర్థికసాయం

పిట్టలవానిపాలెం, అక్టోబరు 5 : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానంలో ప్రసాదాలు తయారు చేసే నూతన వంటసాల నిర్మాణానికి యుఎస్ఎ అయితాబత్తిని రాజావిజయ్‌గౌతమ్, లక్ష్మీదీప్తి దంపతులు రూ.లక్షా 50 వేలు విరాళంగా శనివారం అందజేశారని దేవస్థానం కార్యనిర్వాహణాధికారి కె.నాగేశ్వరరావు తెలిపారు. చెరుకుపల్లి మండలం గుళ్ళపల్లి గ్రామానికి చెందిన రిటైర్డ్ డిప్యూటీ కమిషనర్ కాటూరి వెంకటేశ్వరరావు రూ.25 వేలు తనవంతుగా విరాళాన్ని ప్రకటించినట్లు చెప్పారు. సంబంధిత భక్తులతో వంటశాల నిర్మాణానికి భూమి పూజ కార్యక్రమం నిర్వహించినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.నాగేశ్వరరావు తెలిపారు.



వంటసాల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఆలయ కార్యనిర్వాహణాధికారి నాగేశ్వరరావు, ఫెస్టివల్ అధికారి నరసింహమూర్తి

● శ్రీబగళాముఖి అమ్మవారి ఆలయానికి చీఫ్ ఫెస్టివల్ అధికారిగా జి.నరసింహమూర్తిని నియమించినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.నాగేశ్వరరావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ అత్యంత ప్రసిద్ధిగాంచిన శ్రీబగళాముఖి అమ్మవారి ఆలయానికి శ్రీదేవిశరన్నవరాత్రి మహోత్సవాల సందర్భంగా చీఫ్ ఫెస్టివల్ అధికారిగా జి.నరసింహమూర్తిని గుంటూరు దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్ నియమించారని బాపట్ల డివిజన్ దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ఎస్.కుమార్‌బాబు, కార్యనిర్వాహణాధికారి కె.నాగేశ్వరరావు సంయుక్తంగా తెలిపారు. ఆలయ సిబ్బంది, అర్చకులు నరసింహమూర్తికి అభినందనలు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న ది విశాఖపట్టణం కోఆపరేటివ్‌బ్యాంక్ లిమిటెడ్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు

సహకార సేవలను సామాన్య ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి

బాపట్ల, అక్టోబరు 5 : సహకార బ్యాంక్ సేవలను సామాన్య ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ది విశాఖపట్టణం కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్ చైర్మన్ చలసాని రాఘవేంద్రరావు కోరారు. బాపట్లలోని మహాత్మాగాంధీరోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసి ప్రారంభించనున్న బ్యాంక్ 54వ బ్రాంచ్ గురించి శనివారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ 1916వ సంవత్సరంలో ప్రారంభించిన ఈ బ్యాంక్ దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాలకు విస్తరించిందన్నారు. ముఖ్యంగా ఉమ్మడి గుంటూరు జిల్లాలో 5వ బ్రాంచ్‌గా బాపట్లలో ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో డైరెక్టర్‌లు జేవీ సత్యనారాయణ, చిన్నం కోటేశ్వరరావు, డిప్యూటీ సీఈవో వివిబి వరలక్ష్మి, జోనల్ మేనేజర్ సీహెచ్ వీఆర్ సుబ్రహ్మణ్యం, బ్రాంచ్ మేనేజర్ ఎ.అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

మురుగునీటి మధ్య యానాదుల జీవనం

● ఆదివాసి దినోత్సవం రోజు కూడా కన్నెత్తి చూడని అధికారులు

● విషజ్వరాలు, దుర్గంధంతో అల్లాడుతున్న ప్రజలు



బాపట్ల 3వవార్డు రాజీవ్‌గాంధీకాలనీలో యానాదుల పాకల చుట్టూ నిలిచిన మురుగునీరు

బాపట్ల, అక్టోబరు 5 : భారీవర్షాలు, వరదనీటి వల్ల ముంపునకు గురైన అనేక ప్రాంతాలు బయటపడినప్పటికి బాపట్లలోని 3వ వార్డు రాజీవ్‌గాంధీ కాలనీలో పూరిపాకలు వేసుకొని నివాసం ఉంటున్న యానాదుల కుటుంబాలు మాత్రం ఇంకా బయటపడలేదు. నేటికి ఇళ్ళ చుట్టూ నిలిచిన మురుగునీరు అలాగే ఉంది. దీనికితోడు నిలిచిన నీరు మురుగుగా మారి దుర్వాసన వెదజల్లుతున్నది. ఫలితంగా ఈప్రాంతంలోని అనేక మందికి విషజ్వరాలు కూడా వ్యాపించాయి. అయినప్పటికి అధికారులు మొక్కుబడిగా వచ్చి చూసి వెళ్ళారే తప్ప మురుగు తొలిగించలేదు. కనీసం మురుగునీటిలో ఆయిల్‌బాల్స్ వేయటం, యాంటీలార్వా స్ప్రే చేయటం వంటివి కూడా చేయలేదు. ఫలితంగా దోమల వ్యాప్తి అధికమై రాత్రులు అల్లాడిస్తున్నాయి. అదేవిధంగా చుట్టుపక్కల ఉన్న ఖాళీ స్థలాలలో నీరు నిలిచి తటాకాలను తలపిస్తున్నాయి. గత 36 రోజులుగా అనేక ఇబ్బందులు పడుతున్న ఎస్టీ కుటుంబాల వైపు ఆదివాసి దినోత్సవం రోజు కూడా అధికారులు కన్నెత్తి చూడకపోవటం అనేక విమర్శలకు దారితీస్తున్నది. దుర్గంధపూరితమైన ఈప్రాంతాలలో పందులు స్వైరవిహారం చేయటం పరిపాటిగా మారింది. ఈ ప్రాంతంలో నీరు మాత్రం బయటకెళ్ళే పరిస్థితి కనిపించటంలేదు. నీరు నిల్వటం వల్ల విషపురుగులు పాకలలోకి వస్తున్నాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు, సచివాలయ సిబ్బంది వచ్చి తాత్కాలికంగా మురుగునీరు వెళ్ళేందుకు సిమెంట్ రోడ్డు పగలగొట్టి తూము ఏర్పాటు చేశారు. దీనివల్ల పైపై నీరు వెళ్ళిందే తప్ప మురుగునీరు అలాగే ఉండిపోయింది. సంబంధిత ఉన్నతాధికారులు సమస్యపై స్పందించాల్సిన అవసరం ఉంది. కాగా ఈ విషయమై మున్సిపల్ డీఈ కె.శ్రీనివాసరావును వివరణ కోరగా ఇంజన్‌లు పెట్టి మురుగు నీటిని బయటకు పంపిస్తామని చెప్పారు.

లింగ నిర్ధారణ వెల్లడి నిషేధం : కలెక్టర్

● కలెక్టర్ జె.వెంకటమురళి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటమురళి, జడ్జి వాణి, అడిషనల్ ఎస్పీ విఠలేశ్వర్

బాపట్ల, అక్టోబరు 5 : గర్భస్థ పిండలింగ నిర్ధారణను వెల్లడించటం నిషేధమని కలెక్టర్ జె.వెంకటమురళి తెలిపారు. గర్భస్థ పిండ లింగనిర్ధారణ, వెల్లడి, లింగ ఎంపిక నిషేధంపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం శనివారం కలెక్టరేట్‌లో జరిగింది. కమిటీ చైర్మన్, కలెక్టర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. గర్భస్థ పిండలింగనిర్ధారణ వెల్లడిని అరికట్టేలా అధికారులు డికాయి ఆపరేషన్ నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. డికాయి ఆపరేషన్‌లో పోలీసులను చేర్చాలని, స్కానింగ్ ఫలితాలు వెల్లడించే వారిని కఠినంగా శిక్షించాలన్నారు. అల్ట్రాస్కానింగ్‌సెంటర్ యజమానులకు చట్టంపై అవగాహనతోపాటు శిక్షణనివ్వాలన్నారు. జిల్లాలోని ప్రైవేట్ వైద్యులను సమావేశ పరిచి చట్టంపై అవగాహన కల్పించాలన్నారు. ఆర్‌ఎంపీలకు శిక్షణ, ఉల్లంఘనపై హెచ్చరికలు జారీ చేయాలన్నారు. క్షేత్ర స్థాయిలో పనిచేసే ఎఎన్ఎంలు, ఆశాకార్యకర్తలకు శిక్షణనిచ్చి పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. జిల్లా స్థాయిలో టోల్ ఫ్రీనెంబరు ఏర్పాటు అవసరమన్నారు. అబార్షన్ కొరకు డాక్టర్‌లు విధిగా అనుమతులు పొందాల్సిందేనని కలెక్టర్ చెప్పారు. అబార్షన్ చేయించుకోవటానికి బాపట్ల నుంచి ఇతర జిల్లాలకు వెళ్ళే వారిపై నిఘా ఉంచాలన్నారు. చట్టంపై అవగాహన కల్పిస్తూ రైల్వేస్టేషన్, బస్టాండ్ తదితర పబ్లిక్ ప్రదేశాలలో ప్రసార పత్రాలు, వాల్‌పోస్టలు ఉంచాలన్నారు. థియేటర్లు, టివిచానల్స్‌లో ప్రచారం చేయాలన్నారు.

లింగనిర్ధారణ వెల్లడిస్తే కఠిన చర్యలు : జడ్జి జి.వాణి

లింగనిర్ధారణ పరీక్షలలో గర్భస్థపిండ లింగనిర్ధారణ వెల్లడిస్తే సదరు వ్యక్తులను కఠినంగా శిక్షించాలని ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి జి.వాణి తెలిపారు. సమావేశంలో ఆమె మాట్లాడుతూ డికాయి ఆపరేషన్ జరగాలన్నారు. హెల్ప్‌డెస్క్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. లింగనిర్ధారణ వెల్లడించటం, అబార్షన్ చేయటంపై గర్భిణుల తల్లిదండ్రులు, బంధువులు నాయకులతో రాజీపడుతున్నారని వివరించారు. రాజీపడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. షాడోస్ ఎన్జీవోస్ డైరెక్టర్ డాక్టర్ డేవిడ్‌సన్ సాల్మన్ చేసిన పలుసూచనలపై అధికారులు చర్చించారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ టిపి విఠలేశ్వర్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారిణి డాక్టర్ ఎస్.విజయమ్మ, డిసిహెచ్ఎస్ కోఆర్డినేటర్ శేషుకుమార్, ఉపవైద్యఆరోగ్యశాఖాధికారిణి రోహిణి రత్నశ్రీ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు



శ్రీలలిత త్రిపురసుందరి పీఠంలో శ్రీఅన్నపూర్ణాదేవిగా అమ్మవారు



గాయత్రీదేవి అలంకరణలో శ్రీబగళాముఖిఅమ్మవారు



చెరుకుపల్లి మండలం కావూరు గ్రామంలో అన్నపూర్ణాదేవిగా....

బాపట్ల, అక్టోబరు 5 : శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారు బాపట్లలోని పలు ప్రాంతాలలో శ్రీఅన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సూర్యలంకరోడ్డులోని టౌన్‌హాలులో శ్రీలలిత త్రిపురసుందరిదేవి పీఠం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేడుకలలో అమ్మవారు శ్రీఅన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారికి కుంకుమార్చన, విశేష నివేదనలు గావించారు. శనివారం సందర్భంగా శనిగ్రహ అరాధన, దీపార్చన అనంతరం మహిళలచే అన్నపూర్ణాష్టకం, అన్నపూర్ణసూక్తం, శ్రీలలిత సహస్రనామపారాయణం చేశారు. పీఠం నిర్వాహకులు నెమలికంటి హనుమంతరావు, పంగులూరి కౌండిన్యశర్మ, సొల్లేటి యశ్వంత్, వక్కలగడ్డ బాలాజీ, ఉప్పాల హరికృష్ణ తదితరులు భక్తులకు వసతులు కల్పించారు. మండలంలోని శ్రీమహర్షి ఆశ్రమ గోశాలలో నిర్వహిస్తున్న వేడుకలలో మూడో రోజు అన్నపూర్ణదేవతగా అమ్మవారిని అలంకరించి ప్రదోషకాలంలో నవనాగసహిత మానసాదేవికి అన్నపూర్ణ అవతార దుర్గాదేవికి విశిష్ట దీపోత్సవం చేశారు. శ్రీసంపత్ గణపతిపరివార్ నిర్వాహకులు బి.బాబునాగేంద్ర సభ్యులతో కలిసి కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని భీమావారిపాలెంలోని శ్రీ కోదండరామాలయంలో జరుగుతున్న వేడుకలలో అమ్మవారు శ్రీలలిత త్రిపురసుందరీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీకన్యకాపరమేశ్వరిదేవస్థానంలో అమ్మవారు శ్రీ అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య సంఘనాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమం అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాతబస్టాండ్‌లోని శ్రీ లక్ష్మీపద్మావతి సహిత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో అమ్మవారు శనివారం అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

● రేపల్లె, అక్టోబరు 5 : శ్రీదేవీ శరన్నవరాత్రిమహోత్సవంలో భాగంగా మూడో రోజు శనివారం విఘ్నేశ్వరపూజ, అమ్మవారికి కుంకుమపూజ, ప్రదోషకాల పూజ, కుంకుమార్చన ఆయా ఆలయ అర్చకులు పవన్‌కుమార్‌శర్మ నిర్వహించారు. మంగళగౌరీ, వైష్ణవిదేవీగా భక్తులకు శనివారం దుర్గమ్మ దర్శనమిచ్చింది పట్టణంలోని ఇసుకపల్లి చెన్నమల్లేశ్వరస్వామి దేవాలయంలో, రైలుపేట అభయాంజనేయస్వామి దేవాలయంలో, శారదాపీఠంలో, రెల్లికాలనీలో, 3వవార్డు రామమందిరం వద్ద, అరవపల్లి గ్యాస్ కంపెనీ వద్ద దేవీశరన్నవరాత్రులలో భాగంగా మూడవరోజు అమ్మవారికి కుంకుమపూజ, లలితా సహస్రనామ పారాయణం తదితర పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

● చెరుకుపల్లి, అక్టోబరు 5 : గ్రామాల్లో దసరా ఉత్సవాలను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు. కావూరులోని శ్రీరామలింగేశ్వరస్వామి దేవస్థానంలో అన్నపూర్ణాదేవిగా అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అదేవిధంగా గుళ్ళపల్లి, చెరుకుపల్లి, గూడవల్లి, నడింపల్లి, కనగాల, ఆరేపల్లి గ్రామాల్లో దేవీ శరన్నవరాత్రులు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. ప్రతి గ్రామంలో అమ్మవారి విగ్రహాలను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నారు. ఊచావారిపాలెం రామమందిరం వద్ద ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహం వద్ద ఊచా వెంకటేశ్వరరావు, రమాదేవి దంపతులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. భక్తులకు ఆలయ కమిటీ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలను అందించారు. అదేవిధంగా గుళ్ళపల్లిలోని ఆనందేశ్వరస్వామి ఆల యంలో ఆలయ శాశ్వత ధర్మకర్త పొన్నపల్లి సత్యనారాయణ దంపతులు అమ్మవారికి పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలను అందించారు.

● వేమూరు, అక్టోబరు 5 : శ్రీదేవి శరన్నవ రాత్రి ఉత్సవాలలో భా

గంగా శనివారం మూడవ రోజు స్వాతి నక్షత్ర పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయాలలో విశేషంగా కుంకుమార్చనలు నిర్వహించారు. చావలి వాలేశ్వరాలయంలో అమ్మవారిని కాత్యాయని దేవిగా, జంపని రామేశ్వరాలయంలో గాయత్రీదేవిగా అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. చావలిలో నిర్మితమైన 8 దిక్కుల రామ మందిరాలలో దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్ఠించి విశేషంగా వార్షిక ఉత్సవ పూజలు నిర్వహిస్తున్నారు. పెరవలి, అబ్బనగూడవల్లి, వరహాపురం, చదలవాడ, బూతుమల్లి శివాలయాల్లో, జంపని చెన్నకేశవ ఆలయంలో పంచామృత అభిషేకాలతో పాటు స్వామి, అమ్మవారిని పట్టు వస్త్రాలు పుష్పమాలలతో విశేషంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వారి గోత్రనామాలతో పూజలు జరిపించుకుని అర్చనలు ఆశీర్వాదాలు పొందుతున్నారు.

● అమృతలూరు, అక్టోబరు 5 : దేవీ శరన్నవరాత్రుల్లో భాగంగా ప్రసిద్ధి చెందిన శైవ క్షేత్రం గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయంలో పార్వతి అమ్మవారిని శనివారం అలంకరణ చేశారు. ఈ సందర్భంగా మహన్యాసపూర్వక రుద్రాభిషేకం, సహస్రనామ కుంకుమార్చన పూజలు చేశారు. పూజా కార్యక్రమాలను ఆలయ ప్రధాన అర్చకులు స్వర్ణ వెంకటశ్రీనివాసశర్మ నిర్వహించారు. మండల పరిధిలోని గ్రామాల్లో, పలు ఆలయాల్లో వివిధ రూపాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. కూచిపూడి శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు గాయత్రి దేవి రూపంలో దర్శనమిచ్చారు.



గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయంలో శ్రీలలితాత్రిపుర సుందరి దేవి అలంకరణ



భట్టిప్రోలులో అన్నపూర్ణాదేవిగా వాసవీ మాత

● భట్టిప్రోలు (కొల్లూరు), అక్టోబరు 5 : శ్రీమద్దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలలో భాగంగా పలు ఆలయాల్లోని అమ్మవార్లు వివిధ అలంకారాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. శనివారం భట్టిప్రోలులోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో వాసవీ మాత అమ్మవారు అన్నపూర్ణాదేవిగా, కొల్లూరు మండలం కోటిపల్లి సోమశేఖరస్వామి దేవాలయంలో సత్యజ్ఞానప్రసూనాంబ అమ్మవారు అన్నపూర్ణాదేవిగా, కొల్లూరులోని అనంత భోగేశ్వర స్వామి దేవస్థాన ప్రాంగణంలో వేంచేసియున్న పార్వతీ అమ్మవారు గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

● పిట్టలవానిపాలెం, అక్టోబరు 5 : మండలంలోని చందోలు గ్రామంలో ఉన్న శ్రీబగళాముఖి అమ్మవారి దేవస్థానంలో శ్రీదేవిశరన్నరాత్రి మహోత్సవాలలో భాగంగా శుక్రవారం రెండో రోజు శ్రీబగళాముఖి అమ్మవారు శ్రీవేదమాత గాయత్రిదేవి అమ్మవారిగా భక్తులకు దర్శనమిచ్చారని ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.నాగేశ్వరరావు తెలిపారు. భక్తులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు.భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. చందోలుగ్రామంలో వేంచేసియున్న శ్రీలింగోద్భవ స్థానంలో వేంచేసియున్న శ్రీపార్వతిదేవి అమ్మవారు అశ్వారుఢాదేవి అలంకరణలో భక్తులకు దర్శమనిచ్చారు. శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో ఉన్న శ్రీరాజ్యలక్ష్మీఅమ్మవారు శ్రీమహా చండీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారని తెలిపారు.

● కర్లపాలెం, అక్టోబరు 5 : కర్లపాలెం ఆర్యవైశ్య కల్యాణ మండలంలో శనివారం అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. కొల్లపూడి శ్రీనివాస, గణేష్, సాయి ప్రవల్లిక, వెంకట్రావు, ఇందిరాదేవి పూజలు నిర్వహించారు. కర్లపాలెం పంచాయతీ బంగారురెడ్డిపాలెంలో అమ్మవారికి నిర్వహించిన పూజలలో ఆట్ల వెంకటేశ్వర రెడ్డి, హైమావతి దంపతులు పాల్గొన్నారు. ఎం.వి.రాజుపాలంలో ఆట్ల వారి ఇలువేల్పు దేవత శ్రీబురకాయల అంకమ్మతల్లి గుడిలో ప్రత్యేక పూజలు నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆట్ల బాల శంకర్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. కర్లపాలెం శ్రీపెద్దింటమ్మతల్లి కల్యాణ మండపంలో శనివారం గాయత్రిదేవిగా అమ్మవారు పూజలు అందుకున్నారు. పాతనందాయపాలెంలో చీరాలవారి ఇలవేల్పు గుడారంకమ్మ అమ్మవారు గాయత్రిమాత అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రెడ్డి జేఏసీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు ఆట్ల సుబ్బారెడ్డి దంపతులు, భక్తులు పాల్గొన్నారు.



బూరుగులమ్మ అమ్మవారి దేవాలయంలో మంగళగౌరిగా దుర్గమ్మ



చావలి వాలేశ్వరాలయంలో కాత్యాయనీ దేవి అలంకారం



కర్లపాలెం ఆర్యవైశ్యకళ్యాణ మండపంలో అన్నపూర్ణదేవిగా అమ్మవారు

గాజుల్లంక, జువ్వలపాలెంలో ఇసుక నిల్వలు పరిశీలించిన కలెక్టర్

కొల్లూరు, అక్టోబరు 5 : ఇసుక తవ్వకాలకు అనుకూలమైన ప్రదేశాలను కలెక్టర్ జె.వెంకటమురళి, జేసీ ప్రఖర్‌జైన్‌లు శనివారం పరిశీలించారు. మండల పరిధిలోని గాజుల్లంక, జువ్వలపాలెం వద్ద కృష్ణానదిలో మైనింగ్ అధికారులు గుర్తించిన ఇసుక నిల్వలను కలెక్టర్, జేసీలు పరిశీలన చేశారు. ఎక్కడెక్కడ ఎంత నిల్వలు ఉన్నాయని మైనింగ్ ఏడీ రాజేష్‌కుమార్‌ను కలెక్టర్ ప్రశ్నించారు. సంవత్సరానికి జిల్లాలో ఇసుక ఎంత మేరకు అవసరం అవుతుందని అడుగగా సంవత్సరానికి మూడు లక్షల మెట్రిక్ టన్నులు గృహ నిర్మాణాలు, ప్రభుత్వ అభివృద్ధి పనులకు మూడు లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అవసరం అవుతుందని ఏడీ తెలిపారు. ఇప్పటికీ 4.9 హెక్టార్లలో రెండు చోట్ల ఇసుక నిల్వలు గుర్తించామన్నారు. రెండు చోట్ల ఒకే విధంగా ఎందుకు చేశారని అడుగగా అంతకు మించి ఎక్కువ హెక్టార్లులో ఇసుక తవ్వకాలు చేయాలంటే ప్రజాభిప్రాయ సేకరణ చేయాలని, దీని వలన ఐదు హెక్టార్లలోపు ఇసుక నిల్వలను మాత్రమే గుర్తించినట్లు కలెక్టర్‌కు సమాధానం ఇచ్చారు. ఇవి కాక రెండు రోజుల క్రితం అరవింద వారధి ఎగువన కొంత ఇసుక నిల్వలు, భట్టిప్రోలు మండలం ఓలేరు వద్ద ఇసుక నిల్వలు గుర్తించినట్లు ఏడీ తెలిపారు. పరిశీలన కార్యక్రమంలో ఆయా శాఖల జిల్లా స్థాయి అధికారులు, సిబ్బందితో పాటు కొల్లూరు తహసీల్దార్ బి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



జువ్వలపాలెం వద్ద కృష్ణానదిలో ఇసుక నిల్వలను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటమురళీ, జేసీ ప్రఖర్‌జైన్

అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు



బొబ్బర్లంకలో వలలను పంపిణీ చేసి మాట్లాడుతున్న మత్స్యశాఖ సహాయ సంచాలకులు సైదా నాయక్

రేపల్లె, అక్టోబరు 5 : చేపల వేట చేస్తూ జీవనం కొనసాగిస్తున్న యానాది మత్స్యకారులకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అందిస్తామని మత్స్యశాఖ సహాయ సంచాలకులు సైదా నాయక్ అన్నారు. రేపల్లె మండలం బొబ్బర్లంక గ్రామంలో యానాది మత్స్యకారులకు శనివారం వలలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మడఅడవులు, కాల్వల్లో చేపలు పట్టి జీవనం సాగిస్తున్న కుటుంబాల వారిపై ప్రత్యేక దృష్టిసారించి వారిని అన్ని విధాలా ఆదుకునే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. నియోజకవర్గంలోని ఉన్న యానాది కుటుంబాలకు ఆధార్, రేషన్‌కార్డులు వంటివి సమకూర్చి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అందించనున్నట్లు తెలిపారు. సంఘాలుగా ఏర్పడటం వలన వివిధ రకాల పథకాలైన ద్విచక్ర వాహనాలు, వలలను అందించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో యానాది రాష్ట్ర మహానాడు నాయకుడు పెనుమలశెట్టి శ్రీను, జిల్లా అధ్యక్షుడు పొంగలగిరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పట్టభద్రుల ఓట్లను నమోదు చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న పి.తిలక్‌బాబు

రేపల్లె, అక్టోబరు 5 : గుంటూరు, కృష్ణా ఎమ్మెల్సీ ఎన్నికకు అర్హులైన ప్రతి ఒక్కరూ పట్టభద్రుల ఓటు హక్కుకు నమోదు చేసుకోవాలని ఎన్నారై కళాశాల కరస్పాండెంట్ పి.తిలక్‌బాబు అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శనివారం నియోజకవర్గ పట్టభద్రుల ఓటుహక్కు నమోదుపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 2021 నవంబరు 1వ తేదీకి డిగ్రీ పూర్తి చేసిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు నమోదు చేసుకునే అవకాశం ఉందని తెలిపారు. రేపల్లె టీడీపీ కార్యాలయంలో ఓటుహక్కు నమోదుకు ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేశామని తెలిపారు. నియోకజవర్గంలోని టీడీపీ మండల, గ్రామ, నియోజకవర్గస్థాయిలోని నాయకులంతా కృష్ణా, గుంటూరు జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికలకు మాజీమంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారని, పట్టభద్రుల ఓటు హక్కును ఆయా నాయకులు గుర్తించి ఓటు హక్కును నమోదు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొల్లూరు మాజీ ఎంపీపీ డాక్టర్ కనగాల మధుసూదన్‌రావు, టీడీపీ నాయకులు జీవీ నాగేశ్వరరావు,షేక్ అబ్దుల్ మునాఫ్, వెనిగళ్ళ సుబ్రహ్మణ్యం, పొన్నూరి రామగౌరీకుమారి, నల్లూరు అజయ్‌కుమార్, పిన్నిబోయిన చింతారావు, సూర్యరాజు తదితరులు పాల్గొన్నారు.

మూడు గ్రామాల్లో గ్రామసభలు

వేమూరు, అక్టోబరు 5 : జాతీయ మహాత్మాగాంధీ ఉపాధి హామీ పథకం ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు శనివారం మండలంలోని జంపని, చావలి, చంపాడులో గ్రామ సభలు నిర్వహించారు. ఏపీవో సత్యకృష్ణ అధ్యక్షతన జరిగిన సభలలో ప్రధానమైన 29 అంశాలను ప్రజల ముందు ఉంచి ఆమోదం పొందారు. ప్రధానంగా అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, ఉపాధి పథకం ద్వారా చేపట్టాల్సిన పనులు, ఇంతవరకు పూర్తి చేసిన పనులు ప్రణాళికబద్ధమైన అనేక అంశాలపై సమీక్ష నిర్వహించారు. సభలలో సర్పంచ్‌లు, సచివాలయాల సిబ్బంది, కార్యదర్శులు, ఉపాధి హామీ పథకం సిబ్బంది పాల్గొన్నారు.

'అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ సంతోషం'

నగరం, అక్టోబరు 5 : నవరాత్రులను పురస్కరించుకుని అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించటానికి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానానికి ఇవ్వటం ఎంతో ఆనందంగా ఉందని డాక్టర్ క్రాపా రాహుల్‌కుమార్ అన్నారు. స్థానిక గిరిపురంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో 14 అంగుళాల 12 కేజీల బరువైన దుర్గాదేవి విగ్రహం సమర్పించామన్నారు. ఆయన మాట్లాడుతూ వెలమవారిపాలెం గ్రామస్తులైన చిలకాని బుజ్జిబాబు, నెలమ వాసుబాబు ద్వారా దుర్గాదేవి విగ్రహాన్ని సమర్పించటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థాన కమిటీ సభ్యులు, వెలమవారిపాలెం గ్రామస్తులు, పెద్దలు పాల్గొన్నారు.

పంటనమోదుపై పరిశీలన

పిట్టలవానిపాలెం, అక్టోబరు 5 : మండలంలోని ఖాజీపాలెం, జిఎన్‌పాలెం గ్రామాలలో తహసీల్దార్ పి.మెహర్‌కుమార్, ఈఆర్‌వోలు, వ్యవసాయశాఖాధికారులు, విఆర్ఎలతో కలిసి అన్ని రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. నెలరోజులు నుండి జరుగుతున్న ఈక్రాప్ పంటపై 750రికార్డ్స్ వచ్చాయని గ్రామస్థాయిలో గ్రామ వ్యవసాయ సహాయకులు, గ్రామరెవెన్యూఅధికారులు ఈ పంట నమోదు ఎలా చేశారా అంశంపై తనిఖీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విస్తరణాధికారి సీహెచ్ సుదర్శనరావు, గ్రామరెవెన్యూఅధికారులు పాల్గన్నారు.

నాగరాజుకాల్వలో వ్యక్తి మృతదేహం లభ్యం

బాపట్లరూరల్, అక్టోబరు 5 : బాపట్ల మండలం కొండుభొట్లవారిపాలెం సమీపంలోని నాగరాజుకాల్వలో బాపట్ల పట్టణం ఉప్పరపాలేనికి చెందిన నాగరాజు అనే వ్యక్తి శుక్రవారం రాత్రి సమయంలో కాల్వలోకి దూకి ఆత్మహత్యకు పాల్పడగా గల్లంతయ్యాడు. బాపట్లరూరల్ సీఐ కె.గంగాధరరావు ఆధ్వర్యంలో శనివారం గజ ఈతగాళ్ళతో నాగరాజు కాల్వలో పడవల ద్వారా గాలింపు చర్యలు చేపట్టగా నాగరాజు మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

నూతన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు

పిట్టలవానిపాలెం, అక్టోబరు 5 : మండలంలోని పోతనకట్టవారిపాలెం గ్రామపంచాయతీలో విద్యుత్ లైన్‌తీగలు కిందకు వేలాడుతుండగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ సమస్యను పరిష్కరించాలని విద్యుత్‌శాఖాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మండల విద్యుత్‌శాఖాధికారి కె.చంద్రశేఖరరావు, విద్యుత్ సిబ్బందితో కలిసి పాత విద్యుత్ స్తంభాలను తొలిగించి కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేశారు.

అద్దంకిలో చోరీ


ఎంఈవో సుబ్బయ్య ఇంట్లో బీరువాను తెరిచిన దొంగలు

అద్దంకి, అక్టోబరు 5: ఇంట్లో నిద్రిస్తుండగా వెనుక వైపు వంట గదిలో నుంచి ప్రవేశించి చోరీకి పాల్పడిన ఘటన అద్దంకి పట్టణంలోని ఎల్ఈఎఫ్ నగర్‌లో చోటుచేసుకుంది. తాళ్లూరు ఎంఈవోగా పని చేస్తున్న గురజాల సుబ్బయ్య అద్దంకి పట్టణంలోని ఎల్ఈఎఫ్‌నగర్‌లో సొంత ఇంటిని నిర్మించుకొని ఉంటున్నారు. శుక్రవారం రాత్రి సుబ్బయ్య దంపతులు తాళాలు వేసుకొని నిద్రించారు. అర్ధరాత్రి దాటిన తరువాత 2 గంటల సమయంలో దొంగలు పైఅంతస్తులోకి వచ్చి ఇంటి వెనుక భాగంలో ఉన్న వంటగది తలుపు గడియ బలవంతంగా తెరిచారు. ఒక బెడ్ రూమ్‌లో సుబ్బయ్య దంపతులు నిద్రిస్తుండగా మరో బెడ్ రూమ్‌లో ఉన్న బీరువాను తెరిచి అందులో ఉన్న రూ.లక్ష నగదు, సుమారు 3.5లక్షల విలువైన 64 గ్రాముల బంగారు ఆభరణాలను దొంగిలించారు. శనివారం ఉదయం నిద్ర లేచేచూసి చోరీ జరిగినట్లు గుర్తించారు. సుబ్బయ్య స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. క్ల్యూస్ టీమ్ బృందం వేలిముద్రలను సేకరించారు. ఇటీవల ఎన్టీఆర్ కళాశాల వెనుక వైపు శివసాయి నగర్‌లో కూడా ఇదే తరహాలో ఆరేడు ఇళ్లల్లో నిద్రిస్తుండగానే దొంగలు చోరీలకు ప్రయత్నించారు. అదే విధంగా సుబ్బయ్య ఇంట్లో కూడా చోరీ జరగడంతో అదే ముఠా చోరీలకు పాల్పడి ఉంటారని భావిస్తున్నారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో..

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. పోలీసుల కథనం మేరకు.. అద్దంకి పట్టణంలోని మౌలానగర్‌లో కర్లపూడి సుజాత నివాసం ఉంటున్నారు. 30వ తేదీ ఉదయం పుట్టిల్లు అయిన కురిచేడు వెళ్లారు. గురువారం సాయంత్రం ఇంటికి వచ్చి చూడగా ముందు తలుపు తాళం, బీరువా తాళం పగులగొట్టి ఉన్నాయి. రూ.20వేలు, రూ.60వేల విలువైన బంగారం, వెండి వస్తువులు, ఇతర సరుకులు చోరీకి గురయ్యాయి. సుజాత ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఖాదర్‌బాషా తెలిపారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలి


మున్సిపల్ కమిషనర్ రవీంద్రకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న 8వ వార్డు టీడీపీ నేతలు

అద్దంకి, అక్టోబరు 5: సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిని సారించాలని 8వ వార్డు టీడీపీ నేతలు మున్సిపల్ కమిషనర్ రవీంద్రకు విజ్ఞప్తి చేశారు. కమిషనర్ రవీంద్రను శనివారం 8వ వార్డుకు చెందిన టీడీపీ నేతలు దొప్పలపూడి ప్రసాద్, రామాంజనేయులు, నర్రా సుబ్బయ్య, శివకృష్ణ తదితరులు కలిసి సమస్యలను వివరించారు. ప్రధానంగా జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద ఆక్రమణలు తొలగించాలని, యాదవుల కమ్యూనిటీ హాల్ ప్రహరీ ఏర్పాటు, యానాది సంఘంలో బోరు తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు.

అధైర్య పడకండి.. అండగా ఉంటా!


బుజ్జిరెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, అక్టోబరు 5: అధైర్య పడకండి.. అండగా ఉంటామని ఎమ్మెల్యే కొండయ్య చెప్పారు. ఇటీవల తాడేపల్లిలో చీరాల మండలం కావూరివారిపాలెంకు చెందిన టీడీపీ కార్యకర్త బుజ్జిరెడ్డి పురుగుమందు సేవించి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందే. విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బుజ్జిరెడ్డిని శనివారం ఎమ్మెల్యే కొండయ్య పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. రూ.25వేల సాయాన్ని అందజేశారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

నేడు సంతమాగులూరులో మంత్రి పర్యటన

సంతమాగులూరు, అక్టోబరు 5: అడవిపాలెం వద్దగల అద్దంకి బ్రాంచి కెనాల్ 18/0 వద్ద ఉదయం 10:45 గంటలకు ఎన్నెస్పీ అధికారులు, రైతులతో కలిసి మంత్రి రవికుమార్ పర్యటిస్తారు. అనంతరం 11:45కి పుట్టావారిపాలెం అతిథి గృహంలో ప్రజలు, నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటారని చిలకలూరిపేట క్యాంపు కార్యాలయ సిబ్బంది తెలిపారు.

ఆశాజనకంగా వేట


చేపలను బోటులో తీరానికి చేరుస్తున్న మత్స్యకారులు

చీరాల, అక్టోబరు 5: ప్రస్తుతం సముద్రంలో వేట ఆశాజనకంగా ఉంది. దీంతో హైలెస్సా.. హైలెస్సా అనే కోరస్ గీతాలు ఆనందంగా వినిపిస్తున్నాయి. కడలిని నమ్ముకున్న కష్టజీవులు. గంగమ్మతల్లి ముద్దుబిడ్డలు. సముద్రంలో వేట సక్రమంగా సాగితే వారికి పండుగే. లేదంటే దండగ. ఈ నేపథ్యంలో ప్రస్తుతం వేట ఆశాజనకంగా సాగుతోందని, నాలుగు రూపాయలు మిగులుతున్నాయని మత్స్యకారులు ఆనందంవ్యక్తం చేస్తున్నారు.

చిన్నారుల మృతి బాధాకరం


అంజిరెడ్డిని పరామర్శిస్తున్న మంత్రి గొట్టిపాటి

పంగులూరు, అక్టోబర్ 5 : ఆటలాడుకుంటూ ప్రమాదవశాత్తు నీటి కుంటలో పడి చిన్నారులు మణిశ్రీ బ్రహ్మారెడ్డి, సిద్ధురెడ్డి దుర్మరణం చెందడం బాధాకరమని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అన్నారు. మండలంలోని బూదవాడ గ్రామంలో శనివారం రాత్రి చిన్నారుల కుటుంబ సభ్యులను మంత్రి గొట్టిపాటి పరామర్శించారు. చిన్నారుల మృతిపట్ల తీవ్ర సంతాపం తెలిపారు. రెండేళ్ల కిందట కుమారుడు భాస్కరరెడ్డి మరణించగా, నీటి కుంటలో పడి ఇద్దరు మనవళ్లు మృతిచెందడంతో తల్లడిల్లుతున్న తాత అంజిరెడ్డిని మంత్రి రవికుమార్ ఓదార్చారు. మంత్రి వెంట స్థానిక నేతలు కొమ్మారెడ్డి సుబ్బారెడ్డి, శ్రీనివాసరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు రావూరి రమేష్, కుక్కపల్లి ఏడుకొండలు, గుదిబండ్ల ఆదిరెడ్డి ఉన్నారు.

పీఎం కిసాన్ నిధులు విడుదల

ఒంగోలు, అక్టోబరు 5(ఆంధ్రజ్యోతి) : ప్రధాన మంత్రి కిసాన్ పథకం 18వ విడత నిధులు శనివారం విడుదలయ్యాయి. ప్రస్తుత వ్యవసాయ సీజన్‌కు ఇవి రెండవ విడత నిధులు. ఏటా మూడుసార్లు విడతకు రూ.2వేల వంతున కేంద్ర ప్రభుత్వం ఏడాదికి ఒక్కొక్క రైతుకు రూ.6వేలను ఈ పథకం కింద నేరుగా వారి ఖాతాల్లో జమచేస్తుంది. అలా ఈ ఏడాదికి జిల్లాలో రెండవ విడతగా రూ.2వేల వంతున 2,44,678 మంది రైతులకు రూ.48.94 కోట్ల మొత్తాన్ని కేంద్రం విడుదల చేసింది. మహారాష్ట్రలో జరిగిన బహిరంగ సభలో మోదీ ఈ నిధులు విడుదల చేయగా దేశ వ్యాప్తంగా రైతు సేవాకేంద్రాలలో ప్రత్యక్ష ప్రసారం చేశారు. అన్ని ఆర్బీకేలలో ఈ కార్యక్రమ వీక్షణకు ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం ఆదేశించగా తదనుగుణంగా జిల్లాలో వ్యవసాయశాఖ అధికారులు ఏర్పాట్లు చేశారు. సింగరాయకొండ మండలం కనుమళ్లలో జరిగిన కార్యక్రమంలో జిల్లా వ్యవసాయశాఖ అధికారి సీహెచ్.శ్రీనివాసరావు పాల్గొనగా ఇతర ప్రాంతాల్లో వివిధ స్థాయిల అధికారులు పాల్గొన్నారు. పలుచోట్ల పెద్దసంఖ్యలో రైతులు కూడా హాజరై ప్రధాని సభను ప్రత్యక్షంగా వీక్షించారు.

వసూళ్ల పంచాయితీ

ఉద్యోగుల బదిలీ ఆర్డర్లపై గందరగోళం


జిల్లా పంచాయతీ కార్యాలయం వద్దఉత్తర్వుల కోసం పడిగాపులు కాస్తున్న ఉద్యోగులు

- పక్షంరోజులు గడుస్తున్నా ఇంతవరకు ఇవ్వని ఉత్తర్వులు
- నెలరోజుల క్రితమే కౌన్సెలింగ్ నిర్వహణ
- కౌన్సెలింగ్‌లో కోరుకున్న స్థానాలు తారుమారు
- డీపీవో ఆఫీసు నుంచి బయటకు వెళ్లిన ఉద్యోగే కీలకం

ఉద్యోగుల బదిలీలను కొందరు అధికారులు ఆదాయ వనరులుగా మార్చుకున్నారు. బదిలీల ఉత్తర్వులు తీసుకొని ఆయా స్థానాల్లో చేరాల్సిన వారు ఆ ఆర్డర్ల కోసం కార్యాలయం చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. ఒక్కొక్క ఉద్యోగికి టార్గెట్ పెట్టి అంత మొత్తం ఇస్తేనే ఆర్డర్ ఇస్తామని చెప్పడం కొసమెరుపు. వారడిగినంత ఇచ్చుకోలేమని చెప్పిన ఉద్యోగి గురించి కార్యాలయ అధికారులు పట్టించుకోకుండా ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇదేదో మారుమూలన ఉండే కార్యాలయం అనుకుంటే పొరపాటే. స్వయంగా కలెక్టరేట్‌లోనే ఉండే జిల్లా పంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న తంతు ఇదీ..

ఒంగోలు(కలెక్టరేట్), అక్టోబరు 5: గ్రామపంచాయతీ పరిధిలో పనిచేస్తున్న గ్రేడ్-5, గ్రేడ్-6 పంచాయతీ కార్యదర్శుల బదిలీల ఉత్తర్వుల వ్యవహారం గందరగోళంగా మారింది. నెలరోజుల క్రితమే ఆట్టహాసంగా బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించగా ఇంతవరకు వారికి ఉత్తర్వులు ఇవ్వకపోవడంపై పలు అనుమానాలు నెలకొన్నాయి. కొంతమంది తమకు అనుకూలమైన ప్రాంతాలకు బదిలీపై వెళ్లేందుకు ఎమ్మెల్యేల నుంచి సిఫార్సు చేయించుకున్నా వాటిని పట్టించుకున్న పరిస్థితి లేకుండా పోయింది. ఇంకొకవైపు బదిలీల కౌన్సెలింగ్‌లో ఉద్యోగులు కోరుకున్న స్థానాలను కూడా తారుమారు చేశారన్న ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

బదిలీల ప్రక్రియ గత నెల 22వ తేదీతో ముగిసింది. అయితే నాలుగైదు రోజుల సమయంలో ఆ బదిలీ ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉన్నా ఇంతవరకు ఇవ్వని పరిస్థితి జిల్లా పంచాయతీ కార్యాలయంలో నెలకొంది. సుమారు 200 మందికి పైగా గ్రేడ్-5, 6 పంచాయతీ కార్యదర్శులు భారీగా బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారందరికి ఒకచోట నుంచి మరోచోటకు స్థానచలనం కల్పిస్తూ జిల్లా పంచాయతీ కార్యాలయం నుంచి బదిలీ ఉత్తర్వులు జారీచేయాల్సి ఉంది. ఇప్పటికే గ్రామపంచాయతీల్లో పని చేస్తున్న గ్రేడ్-1 నుంచి గ్రేడ్-4 వరకు బదిలీలు చేసి ఉత్తర్వులు ఇచ్చారు. కానీ గ్రేడ్-5, గ్రేడ్-6 ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో ఉద్యోగులు జిల్లా పంచాయతీ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

చక్రంతిప్పుతున్న బయటి ఉద్యోగి

బదిలీ ఉత్తర్వుల కోసం వచ్చే పంచాయతీ కార్యదర్శుల నుంచి తప్పనిసరిగా పెద్దమొత్తంలో డబ్బులు వసూలు చేయాల్సిందేనంటూ ప్రస్తుతం ఇన్‌చార్జిగా ఉన్న ఉన్నతాధికారి హుకుం జారీచేసినట్లు తెలుస్తోంది. దీంతో జిల్లా పంచాయతీ కార్యాలయంలో పనిచేసే సంబంధిత సెక్షన్ల ఉద్యోగులు చేతులు ఎత్తేసినట్లు సమాచారం. దీంతో గతంలో జిల్లా పంచాయతీ కార్యాలయంలో డిప్యుటేషన్‌పై పనిచేసి అది రద్దుకావడంతో బయటకు వెళ్లిన ఉద్యోగి రంగంలోకి దిగి వసూళ్లు చేసే విషయంలో కీలక పాత్ర పోషిస్తున్నట్లు సమాచారం. గతంలో జిల్లా పంచాయతీ కార్యాలయంలో కీలకపాత్ర పోషించిన ఒక ఉద్యోగి ఇప్పుడు బదిలీపై మరో ప్రాంతానికి వెళ్లారు. ఆ ఉద్యోగి కూడా వారికి అన్ని విషయాలలో సహాయపడుతున్నారు. దీని కారణంగానే గ్రేడ్-5, గ్రేడ్-6 ఉద్యోగులకు బదిలీ ఉత్తర్వులు ఇవ్వకుండా ఉద్యోగులను ఇబ్బందులు పెడుతున్నట్లు తెలుస్తోంది.

బదిలీ స్థానాలను మార్చేశారు!

కార్యాలయంలో పనిచేసే మరో ఉద్యోగి కూడా ఈ విషయంలో కీలకంగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. అన్నీ తానై వ్యవహరిస్తున్నారనే ఆ శాఖలో ప్రచారం నడుస్తోంది. టార్గెట్ పెట్టి మరీ ఒక్కొక్క ఉద్యోగి నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇదిలాఉండగా ఉద్యోగుల బదిలీల కోసం ప్రజాప్రతినిధులు ఇచ్చిన సిఫార్సులను కూడా పక్కనపెట్టి వారి ఇష్టానుసారంగా బదిలీలు చేశారని సమాచారం. కొంతమంది ఉద్యోగులు కౌన్సెలింగ్‌లో వారు కోరుకున్న స్థానాలు కాకుండా తారుమారు చేసి ఇతర ప్రాంతాల్లో నియమించడంతో వారిలో ఆందోళన నెలకొంది. బదిలీల ఉత్తర్వులు ఇంతవరకు బయట పెట్టకపోవడంతో ఈ వాదనలకు మరింత బలం చేకూరుతుంది.

కష్టపడి పనిచేస్తా !


మారిటైం బోర్డు చైర్మన్‌గా బాధ్యతల స్వీకరణ అనంతరం నేతలు, కార్యకర్తలకు అభివాదం చేస్తున్న సత్య, వేదికపై జిల్లా నేతలు

- ఓడరేవుల అభివృద్ధిలో జిల్లాకు ప్రాధాన్యత
- ప్రముఖులు, పార్టీశ్రేణుల సమక్షంలో బాధ్యతలు చేపట్టిన దామచర్ల సత్య
- కార్యాలయాల్లో బాధ్యతలు తీసుకున్న నూకసాని బాలాజీ, లంకా దినకర్

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

'ఏ బాధ్యతల్లోనైనా విజయం సాధించటమే నా లక్ష్యం. తీర ప్రాంతంలో ఓడరేవుల అభివృద్ధిలో నా వంతు పాత్ర పోషిస్తా'నని రాష్ట్ర ఓడరేవులు, హార్బర్ల నిర్వాహణ సంస్థ(మారిటైం) చైర్మన్ దామచర్ల సత్య అన్నారు. శనివారం మారిటైం బోర్డు చైర్మన్‌గా సత్య బాధ్యతలు స్వీకరించారు. మంగళగిరిలోని బోర్డు ప్రధాన కార్యాలయంలో పూజల అనంతరం సమీపంలోని రాయల్ పంక్షన్ హాలులో ఆయన ప్రమాణం చేస్తూ ప్రసంగించారు.

తరలివచ్చిన అభిమానులు

కాగా సత్య ప్రమాణ స్వీకారానికి జిల్లా నుంచి ప్రధానంగా కొండపి నియోజకవర్గం నుంచి పెద్దసంఖ్యలో టీడీపీ శ్రేణులు, అభిమానులు, వివిధ ప్రజా సంఘాల వారు తరలివచ్చారు. అలాగే మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ఇతర ప్రముఖులు కూడా భారీగా హాజరుకావటం విశేషం. తొలుత ఆయన మారిటైం ప్రధాన కార్యాలయంలో పూజలు చేశారు తండ్రి పూర్ణచంద్రరావుతోపాటు ఇతర కుటుంబసభ్యుల సమక్షంలో చైర్మన్‌గా కార్యాలయంలో సంతకం చేశారు. అక్కడికే పలువురు తరలివచ్చి అభినందనలు చెప్పారు. తర్వాత రాయల్ పంక్షన్ హాలులో జరిగిన కార్యక్రమానికి హాజరయ్యారు. ఆ వేదికపై సత్యను కలిసి అభినందించేందుకు అభిమానులు పోటీపడ్డారు. అభినందించే కార్యక్రమం మూడు గంటలపాటు జరగటం అందుకు నిదర్శనం.

తరలివచ్చిన ప్రముఖులు

సత్యను కలిసి స్వయంగా అభినందించేందుకు పలువురు ప్రముఖులు స్వయంగా తరలివచ్చారు. అలాగే కార్యక్రమానికి హాజరుకాలేక పోయిన రాష్ట్ర మంత్రి అచ్చెనాయుడుతో పాటు పలువురు సీనియర్ నాయకులు ఫోన్లు చేసి అభినందనలు తెలిపారు. టీడీపీ పార్లమెంట్ పార్టీ నాయకుడు లావు కృష్ణ దేవరాయలతో పాటు విజయనగరం ఎంపీ హాజరయ్యారు. టీడీపీ రాష్ట్ర అధ్య క్షుడు పల్లా శ్రీనివాసరావుతోపాటు మంత్రులు అనిత, శ్రీనివాస్, సత్యకు అత్యంత సన్నిహితులైన బీసీ జనార్ధన్‌రెడ్డి, సత్యప్రసాద్, కొల్లు రవీంద్ర, రాం ప్రసాద్‌రెడ్డి, గొట్టిపాటి రవికుమార్, స్వామిలతో పాటు ఉమ్మడి జిల్లా టీడీపీకి చెందిన ఎమ్మెల్యేలు, ఇన్‌చార్జిలతోపాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలకు చెందిన 30మందికిపైగా ఎమ్మెల్యేలు వచ్చి సత్యను అభినందించారు.

జిల్లా తీర ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు

రాష్ట్రంలో తీరప్రాంతం ఉన్న ముఖ్యమైన జిల్లాల్లో ఉమ్మడి ప్రకాశం జిల్లా ఒకటి. ఆ ప్రాంతంలో పోర్టులు, హార్బర్లు ఏర్పాటు ద్వారా అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తానని సత్య వెల్లడించారు. టూరిజం డెవలప్‌మెంట్ చైర్మన్ కూడా జిల్లా వాసి అయినందున ఇద్దరం కలిసి అభివృద్ధి కార్యక్రమాలను తీర ప్రాంతాల్లో చేపడతామని ప్రకటించారు.

బాలాజీ, దినకర్‌ల బాధ్యతల స్వీకరణ

అలాగే టీడీపీ జిల్లా అధ్యక్షుడు నూకసాని బాలాజీ, విజయవాడ ఆటోనగర్‌లోని ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ ప్రధాన కార్యాలయంలో శనివారం ఉదయం బాధ్యతలను స్వీకరించారు. ఆయన్ను మంత్రులు రవికుమార్, స్వామిలతోపాటు పలువురు ఎమ్మెల్యేలు, నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. బీజేపీ నుంచి 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్‌గా నియమితులైన ఒంగోలు వాసి లంకా దినకర్ కూడా సచివాలయంలోని తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. జిల్లాకు చెందిన మంత్రులు రవి, స్వామిలతోపాటు ఎమ్మెల్యేలు, నాయకులు కూడా ఆయన్ను కలిసి అభినందనలు తెలిపారు.

ఎక్కడి నుంచైనా దరఖాస్తు

- నెట్ సెంటర్ నుంచీ వేయవచ్చు
- చివరిరోజు కార్యాలయాల్లో ప్రత్యేక కౌంటర్లు
- 58 మద్యం దుకాణాలకు 71 అప్లికేషన్లు
- ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఖాజామోహిద్దీన్



ఒంగోలు(క్రైం), అక్టోబరు 5 : మద్యం దుకాణాల కోసం దరఖాస్తు చేసుకునే వారు ఆన్‌లైన్‌లో ఎక్కడి నుంచైనా వేయవచ్చని, ఏదైనా నెట్ సెంటర్ నుంచి కూడా చేసుకోవచ్చని ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎస్.కె.ఖాజామోహిద్దీన్ తెలిపారు. ప్రకాశం భవన్‌లోని ఈఎస్ కార్యాలయంలో శనివారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఎస్ మాట్లాడుతూ జిల్లాలో మొత్తం 171 మద్యం దుకాణాలకు దరఖాస్తులు కోరుతూ ఈనెల 1న నోటిఫికేషన్ విడుదల చేసినట్లు తెలిపారు. ఇప్పటి వరకు 58 మద్యం దుకాణాలకు 71 దరఖాస్తులు వచ్చాయని వెల్లడించారు. ఈనెల 9వతేదీన 5 గంటలలోపు దరఖాస్తు చేయడానికి తుది గడువుగా నిర్ణయించారని, ఆయా సర్కిల్ కార్యాలయాల్లో నేరుగా అందజేసే అవకాశం ఉందని అన్నారు. ఒక వ్యక్తి ఎన్ని దుకాణాలకైనా దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. లాటరీలో ఎన్ని దుకాణాలు వచ్చినా వారు నిర్వహించుకునే అవకాశం ఉందన్నారు. దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలుగా నిర్ణయించారని చెప్పారు. ఈనెల 10న దరఖాస్తుల పరిశీలన, 11న ఒంగోలులోని ఎన్‌జీవో హోంలో కలెక్టర్ అధ్యక్షతన లాటరీ తీస్తామని అన్నారు. 12 నుంచి మద్యం దుకాణాలు ఏర్పాటు చేసుకోవచ్చని చెప్పారు.

జిల్లాలో 171 దుకాణాలలో రెండు శ్లాబుల కింద లైసెన్స్ ఫీజు వసూలు చేస్తామని తెలిపారు. 120 దుకాణాలకు రూ.65 లక్షలు, 51 దుకాణాలకు రూ. 55 లక్షలుగా ప్రభుత్వం ఫీజు నిర్ణయించిందని పేర్కొన్నారు. లాటరీలో మద్యం దుకాణం పొందిన వారు ఆరు దఫాలుగా లైసెన్స్ ఫీజు చెల్లించే వెసులుబాటు ఉందని చెప్పారు. దరఖాస్తు ఫీజు మాత్రం తిరిగి ఇవ్వరని వివరించారు.

దరఖాస్తు చేసుకునే వారు చివరిరోజు వరకు ఆగకుండా 6, 7 తేదీలలో పూర్తిచేయాలని సూచించారు. సర్వర్ సమస్య రాకుండా ఉండేందుకు ముందస్తుగానే దరఖాస్తు చేసుకోవాలని కోరారు. చివరిరోజు సర్కిల్ కార్యాలయాల వద్ద కౌంటర్లు పెంచుతామని పేర్కొన్నారు. పారదర్శకంగా లాటరీ పద్ధతిలో మద్యం దుకాణాల కేటాయింపు ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

ఖోఖో పోటీలకు రాష్ట్ర బాలికల జట్ల ఎంపిక


అండర్ -14 ఖేలో ఇండియా సౌత్‌జోన్ జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో పాల్గొనే రాష్ట్ర బాలికల జట్టుతో క్రీడాధికారులు


అండర్-17 ఖేలో ఇండియా సౌత్‌జోన్ జాతీయ స్థాయి ఖోఖో పోటీలలో పాల్గొనే రాష్ట్ర బాలికల జట్టుతో క్రీడాధికారులు

పంగులూరు, అక్టోబరు 5 : జాతీయ స్థాయి సౌత్‌జోన్ ఖేలో ఇండియా ఖోఖో పోటీలలో పాల్గొనే రాష్ట్ర బాలికల జట్ల ఎంపిక శనివారం పంగులూరులో జరిగింది. స్థానిక ఎంఎస్ఆర్ అండ్ బీఎస్ఎం జూనియర్ కళాశాల క్రీడా ప్రాంగణంలో జరిగిన అండర్-14, అండర్-17 బాలికల జట్ల ఎంపిక కార్యక్రమంలో 13 ఉమ్మడి జిల్లాల నుంచి 100 మంది క్రీడాకారిణులు జట్టులో స్థానం కోసం పోటీపడ్డారు. ఎంపిక ప్రక్రియలో ఖోఖో అసోషియేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి, రాష్ట్ర రిఫరీస్ బోర్డ్ కన్వీనర్ ఎంవీఎస్ఎస్ ప్రసాద్ (కృష్ణ), కోచ్‌లు జె.పాల్, డీఎల్ లక్ష్మీనారాయణరెడ్డి, పీడీలు పవన్‌కుమార్, సోమేశ్వరరావు, వి.రఘుబాబు, సావిత్రమ్మ, లత, రత్తయ్య, శ్రీనివాసరావు, రాంబాబు, కె.వీరాంజనేయులు, కేరామారావు, సోమశేఖరరెడ్డి పాల్గొన్నారు.

ఎంపికైన రాష్ట్ర క్రీడా జట్లు ఈ నెల 16, 17, 18 తేదీలలో తమిళనాడులోని కోయంబత్తూరు పట్టణంలో జరిగే జాతీయ స్థాయి ఖేలో ఇండియా బాలికల ఖోఖో పోటీలలో పాల్గొంటాయని రాష్ట్ర కార్యదర్శి సీతారామిరెడ్డి తెలిపారు. ఈ ఇరు జట్లకు ఈ నెల 7వ తేదీ నుంచి నెల్లూరు పట్టణంలోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో శిక్షణ యిస్తారని, కోచ్‌గా సుకుమార్ వ్యవహరిస్తారని తెలిపారు.

అండర్-14 బాలికల జట్టు

సౌత్ జోన్ ఖేలో ఇండియా జాతీయ స్థాయి అండర్-14 ఖోఖో పోటీలలో పాల్గొనే రాష్ట్ర బాలికల జట్టును రాష్ట్ర కార్యదర్శి ఎం.సీతారామిరెడ్డి శనివారం ప్రకటించారు. ఈ జట్టుకు కె.భవాని, షేక్ గౌసున్నీషా (నెల్లూరు), ఎం.హారిక, జి.చందన (శ్రీకాకుళం), ఎం.యువశ్రీ (చిత్తూరు), ఎం.ధనలక్ష్మి, ఎస్.హారిక (విజయనగరం), ఎ.హేమలత, బి.ఐశ్వర్య, జి.గురవమ్మ (ప్రకాశం), షేక్ మున్నీషా (గుంటూరు), జి.హరిత (కడప), పీవీజీ లక్ష్మి (ప.గో), కావేరి (అనంతపురం), డి.వినీషా (కృష్ణా), హారిక (కర్నూల్) ఎంపికైనట్లు సీతారామిరెడ్డి తెలిపారు.

అండర్-17 రాష్ట్ర బాలికల జట్టు

కె.పవిత్ర, ఎస్.స్రవంతి (నెల్లూరు), ఆర్.జాహ్నవి (విజయనగరం), ఎ.పురందేశ్వరి, టి.సుశ్మిత (ప్రకాశం), కె.స్వప్న (అనంతపురం), ఆర్.తనూజ, జి.భవాని, ఎస్.తేజశ్రీ (శ్రీకాకుళం), వి.అర్చనశ్రీ (కర్నూల్), స్రవంతి (కడప), బి.యశ్విత, మణిచంద్రిక (ప.గో), జి.అణిత (కృష్ణ), డి.రంగమహాలక్ష్మి(గుంటూరు), పి.జ్యోత్స్న (విశాఖ) సత్యవతి (చిత్తూరు) ఎంపికయ్యారని సీతారామిరెడ్డి తెలిపారు.

అద్దంకి పోలీస్ స్టేషన్‌లో సిబ్బంది కొరత

- ఒకవైపు తరచూ చోరీలు
- మరో వైపు ట్రాఫిక్ సమస్య
- విధులంటే బెంబేలెత్తుతున్న పోలీస్ సిబ్బంది
- పట్టణం మీదుగా నామ్ రోడ్డు ఉండడంతో పెరిగిన దొంగతనాలు
- వరుస ఘటనలతో ఆందోళనలో ప్రజలు

అద్దంకి, అక్టోబరు 5 : అద్దంకి పోలీస్ స్టేషన్‌లో పోస్టింగ్ అంటేనే సిబ్బంది ససేమిరా అంటున్నారు. జిల్లా కేంద్రమైన బాపట్లకు దూరం ఒక కారణం అయితే పనిభారం ఎక్కువగా ఉండడం ప్రధాన కారణంగా నిలుస్తున్నట్లు తెలుస్తుంది. అద్దంకి మున్సిపాలిటీ, రూరల్ మండలం కలిపి అద్దంకి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉంది. సుమారు లక్ష మంది వరకు జనాభా ఉన్నారు. దీనికి తోడు నామ్ రోడ్డు అద్దంకి పట్టణం మధ్యలో గుండా వెళ్లడంతో తరచూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతోంది. గతంలో ఎస్ఐ స్థాయి అధికారి ఎస్‌హెచ్‌వోగా ఉండగా అప్ గ్రేడ్ చేసిన తరువాత సీఐ స్థాయికి పెంచారు. ఇద్దరు ఎస్ఐలను కేటాయించినటప్పటికీ సిబ్బంది మాత్రం సాధారణ పోలీస్ స్టేషన్ స్థాయిలోనే ఉన్నారు. సుమారు 35 మంది వివిధ క్యాడర్‌ల పోలీస్ సిబ్బంది ఉన్నప్పటికీ అందులో వివిధ పనులు, కారణాలతో 10 మంది వరకు స్థానిక విధులకు హాజరయ్యే పరిస్థితి లేదు. 25 మంది సిబ్బందితోనే వెళ్లదీసుకు రావాల్సిన పరిస్థితి ఏర్పడిందని అధికారులు తలపట్టుకుంటున్నారు. అద్దంకి పట్టణంతో పాటు, మండలంలోని పలు గ్రామాలు నామ్ రోడ్డుకు వెంబడి, అత్యంత సమీపంలో ఉండడంతో చోరీలకు కూడా అనువుగా మారింది. దూరప్రాంతాల నుంచి వచ్చిన దొంగలు అర్ధరాత్రి సమయంలో ఏదో ఒక లారీలో వచ్చి దొంగతనాలు ముగించుకొని దర్జాగా వెళ్లి పోతున్నారు. ప్రతినెలా అద్దంకి పోలీస్ స్టేషన్ పరిధిలో కనీసం ఐదారు దొంగతనాలు జరుగుతున్నాయంటే ఆశ్చర్యం కలుగక మానదు. ఒకే రోజు నాలుగైదు ఇళ్లల్లో చోరీలు జరుగుతుండడం ఇటీవల కాలంలో ఎక్కువైంది. పట్టణంలో రెండు నెలల కిందట నాలుగైదు ఇళ్లలో దొంగతనాలు జరిగాయి. గత నెలలో ఆరేడు ఇళ్లల్లో ఒకేరాత్రి చోరీలకు ప్రయత్నాలు జరిగాయి. గత పది రోజుల వ్యవధిలో మూడు చోరీలు జరిగాయి. వారం రోజుల కిందట వేలమూరిపాడు రోడ్డులో ఆంజనేయస్వామి దేవాలయం తాళం పగులగొట్టి హుండీల కానుకలను దొంగలించారు. ఐదు రోజుల కిందట అదే ప్రాంతంలో వాకింగ్‌కు వెళ్లిన మహిళ మెడలో బంగారం గొలుసును మోటార్‌సైకిల్ పై వచ్చిన యువకుడు లాక్కొని వెళ్లాడు. ఇది మరవక ముందే శుక్రవారం అర్ధరాత్రి సమయంలో అద్దంకి పట్టణంలోని ఎల్‌ఈఎఫ్ నగర్‌లో నివాసముంటున్న తాళ్లూరు ఎంతో సుబ్బయ్య ఇంట్లో చోరీ జరిగింది. ఇక మోటార్‌సైకిళ్లు, వ్యవసాయ మోటార్‌ల వైర్లు, ఇతర చిల్లర దొంగతనాలు అయితే తరచూ జరుగుతునే ఉన్నాయి.



1. ఎన్టీఆర్ కళాశాల వెనుక శివసాయినగర్‌లో పగులగొట్టిన కిటికీ (ఫైల్)
2.వేలమూరిపాడు రోడ్డులో ఆంజనేయస్వామి గుడి తాళం పగులగొట్టిన దొంగలు (ఫైల్)

అద్దంకి పట్టణంలో గుండా నామ్ రోడ్డు వెళ్తుండడం, నామ్ రోడ్డు నిర్మాణ సమయంలో కూడా పూర్తి స్థాయిలో విస్తరించకుండా ఉన్నమేర మాత్రమే రోడ్డు నిర్మాణం చేశారు. అదే సమయంలో తోపుడు బండ్లు రోడ్ల పైనే నిలిపి వ్యాపారాలను చేస్తున్నారు. వీటన్నింటికీ మించి భవానీ సెంటర్ ఐదు రోడ్ల కూడలి కావడంతో అన్ని వైపులా వెళ్లే వాహనాలు ఎవరికి వారే రోడ్డు పైకి వస్తుండడంతో తరచూ ట్రాఫిక్ నిలిచిపోతోంది. ప్రధాన కూడలి ప్రాంతాలు అయిన రామ్‌నగర్, అంబేడ్కర్ బొమ్మ సెంటర్, పాత బస్టాండ్, ఆర్టీసీ బస్టాండ్, పోతురాజుగండి, భవానీ సెంటర్, కలవకూరు క్రాస్ రోడ్డు, శింగరకొండ క్రాస్ రోడ్డుల వద్ద ట్రాఫిక్ కానిస్టేబుళ్ల పర్యవేక్షణ ఉండాల్సి ఉండగా, ఎప్పుడో మొక్కుబడిగా మాత్రమే కన్పిస్తున్నారు. దీంతో మిగిలిన చోట్ల అలా ఉంచితే భవానీ సెంటర్‌లో మాత్రం ప్రతినిత్యం ట్రాఫిక్ సమస్యతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

అద్దంకి ఎమ్మెల్యేగా ఉన్న గొట్టిపాటి రవికుమార్ మంత్రిగా ఉండడంతో పోలీస్ సిబ్బంది ఎస్కార్ట్‌గా వెళ్లాల్సి ఉంటుంది. అదే సమయంలో మంత్రి హాజరయ్యే కార్యక్రమాల వద్ద కూడా బందోబస్తు నిర్వహించాల్సి ఉంటుంది. ఇక హైదరబాద్‌కు తరచూ వీఐపీలు నామ్ రోడ్డు గుండా వెళ్తుండడంతో ఎస్కార్ట్ డ్యూటీకి కూడా వెళ్లాల్సి ఉంటుంది. దీంతో అద్దంకి పోలీస్ స్టేషన్‌లో ఒకే ఒక్క వాహనం ఉండడంతో సీఐ అత్యవసర పనుల నిమిత్తం జిల్లా కేంద్రానికి వెళ్లిన సందర్భాల్లో ఎస్కార్ట్ వాహనం అందుబాటులో ఉండడం లేదు. తక్కువ మంది సిబ్బంది ఉండడంతో పనిభారం ఎక్కువగా ఉంటోందని పలువురు సిబ్బంది అద్దంకి స్టేషన్‌కు రావాలంటేనే భయపడుతున్నట్లు తెలుస్తుంది. ఇటీవల అద్దంకి పోలీస్ స్టేషన్ నుంచి 10 మంది సిబ్బంది ఇతర ప్రాంతాలకు బదిలీ కాగా, ఇక్కడకు ఎవరూ వచ్చేందుకు ఇష్టపడడం లేదంటే పరిస్థితి ఏ విధంగా ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. దీంతో బదిలీ అయిన 10 మంది కానిస్టేబుళ్లను కూడా రిలీవ్ చేసేందుకు ఎస్‌హెచ్‌వో నిరాకరించినట్లు తెలుస్తుంది.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అద్దంకి పోలీస్ స్టేషన్‌ను అద్దంకి మున్సిపాలిటీ పరిధి వరకు ఒకటి, రూరల్ మండలం వరకు మరో స్టేషన్‌గా మార్చాల్సిన అవసరం ఉందని, అదే సమయంలో ట్రాఫిక్‌కు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. అలా కాని పక్షంలో సరిపడా సిబ్బందిని కేటాయించాలని పలువురు కోరుతున్నారు.



ట్రాఫిక్ జామ్‌తో బారులుతీరిన వాహనాలు



1. మోదేపల్లిలో 10 గంటల తరువాత తెరుచుకోని సచివాలయం
2. కుంకుపాడు తాళం వేసి ఉన్న రైతు సేవా కేంద్రం

సచివాలయ ఉద్యోగుల ఇష్టారాజ్యం

- సమయపాలన పాటించని వైనం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు

అద్దంకిటౌన్, అక్టోబరు 5 : గ్రామాలల్లో ఉన్న సచివాలయ ఉద్యోగులు వారి ఇష్టారీతిగా వ్యహరిస్తున్నారు. ఉద్యోగులు కనీసం సమయ పాలన పాటించడం లేదు. విధులకు హాజరు కావల్సిన సమయంలో రాకపోవడంతో సచివాలయాలకు తాళాలు తీసే పరిస్థితి లేకపోయింది. దీంతో తమ సమస్యలపై సచివాలయాలకు వచ్చే ప్రజలు కార్యాలయం తెరవకపోవడంతో వెనుదిరిగి వెళ్తున్నారు. అద్దంకి మండలంలోని మోదేపల్లి గ్రామ సచివాలయానికి శనివారం ఉదయం 10 గంటల తరువాత కూడా ఉద్యోగులు ఎవరూ రాకపోవడంతో తాళం వేసే ఉంది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సచివాలయాల్లో ఉద్యోగులు విధులలో ఉండాలి. కానీ గ్రామాలలో ఎవరు చూస్తారులే, అడిగేవారెవరులే అన్న నిర్లక్ష్యమో ఏమో కానీ కనీసం సచివాలయం తలుపులు కూడా తీయని పరిస్థితి నెలకొంది. దీంతో అక్కడకు వచ్చిన ప్రజలు ఉసూరుమంటూ వెనుదిరుగుతున్నారు. ఉద్యోగులు మాత్రం తీరిగ్గా ఎప్పుడో తమ విధులకు హాజరు కావడంపట్ల గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు మండలంలోని కుంకుపాడు గ్రామంలో ఉన్న రైతు సేవా కేంద్రం వద్ద ఇదే పరస్థితి నెలకొంది. పది గంటలు దాటిన తరువాత కూడా ఆ సేవా కేంద్రం తులుపు తెరుచుకోని పరిస్థితి. ఉద్యోగులు తమ విధులకు హాజరు కావడంలో సమయ పాలన పాటించడం లేదని, సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి తగు సమయాలల్లో ఉద్యోగులు సచివాలయాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

వంద శాతం ఈ-పంట నమోదు

అద్దంకిటౌన్, అక్టోబరు 5 : అద్దంకి మండలంలో 8358 ఎకరాలకు సంబంధించి ఈ పంట నమోదు చేయడం జరిగిందని వ్యవసాయ అధికారి కొర్రపాటి వెంకటకృష్ణ తెలిపారు. శనివారం మండలంలోని కలవకూరు గ్రామంలో సూపర్ చెక్ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ ఈనెల 7వ తేదీ నాటికి ఈకేవైసీని పూర్తి చేయాలని సూచించారు. ఇప్పటికే 99.6 శాతం నమోదు చేయడం జరిగిందని, మండలంలో ఇంకా 10 మంది రైతులు పెండింగ్‌లో ఉన్నారని తెలిపారు. సామాజిక తనిఖీ, గ్రామ సభ నిర్వహించి తుది జాబితాను గ్రామ సచివాలయం వద్ద ప్రచురించడం జరుగుతుందన్నారు. రైతుల గమనించి ఈకేవైసీ పూర్తి చేసుకోవాలని తెలిపారు. ఆయన వెంట రైతులు, సిబ్బంది ఉన్నారు.

రేపు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం

అద్దంకిటౌన్, అక్టోబరు 5 : అద్దంకి పట్టణంలోని బంగ్లా రోడ్డులో ఉన్న ప్రేమ ఐ కేర్ ఆప్టికల్స్ రెండవ వార్షికోత్సవం సందర్భంగా ఆసుపత్రిలో ఉచిత మెగా కంటివైద్య శిబిరాన్ని సోమవారం 10గంటల నుంచి జరుగుతుందని డాక్టర్ జి.షాలెంరాజు శనివారం ప్రకటనలో తెలిపారు.

50 బస్తాల రేషన్ బియ్యం స్వాధీనం

చీరాల, అక్టోబరు 5 : కారంచేడు, స్వర్ణ గ్రామాల మధ్య రేషన్ బియ్యాన్ని అక్రమంగా రవాణా చేస్తున్నట్లు అందిన సమాచారంతో కారంచేడు పోలీసులు శనివారం ఆ వాహనాన్ని పట్టుకున్నారు. వాహనాన్ని, డ్రైవర్‌తో పాటు మరో వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్ రైటర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ వాహనంలో 50 బస్తాల రేషన్ బియ్యం ఉన్నాయన్నారు. తహసీల్దార్‌కు విషయం తెలిపామన్నారు. పట్టుబడ్డ ఇద్దరు వ్యక్తులకు 41ఏ నోటీసులు ఇచ్చి పంపామన్నారు. రేషన్ బియ్యంతో పట్టుబడ్డ వాహనం చీరాల నుంచి అద్దంకి వైపు వెళుతున్నట్లు తెలిపారు. ఆ సరుకును కారంచేడులో లోడ్ చేసుకుని స్వర్ణ మీదుగా ఇంకొల్లు వైపు వెళ్లే క్రమంలో కారంచేడు, స్వర్ణ మధ్య పట్టుకున్నారని డ్రైవర్ చెప్పినట్లు సమాచారం.

పొలంలో కూలిన కరెంట్ స్తంభం

బల్లికురవ, అక్టోబరు 5 : మండలంలోని గుంటుపల్లి ముక్తేశ్వరం గ్రామాల మధ్య ఉన్న పంట పొలంలో శనివారం ఎత్తిపోతల పథకానికి వెళ్లే విద్యుత్ స్తంభం ఒక్కసారిగా కూలి పోయింది. కొంత కాలంగా ఈ ప్రాంతంలోని కరెంట్ స్తంభాలు ఒరిగిపోయి ప్రమాదకరంగా ఉన్నాయి. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పొలంలో ఎవరూ లేని సమయంలో స్తంభం కూలి పోవడంతో పెను ప్రమాదం తప్పిందని రైతులు అంటున్నారు. అధికారులు వెంటనే స్తంభాలను వెంటనే సరి చేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు

డివైడర్లకు స్టిక్కర్ల ఏర్పాటు

మేదరమెట్ల, అక్టోబరు 5 : జాతీయ రహదారి వెంబడి ప్రమాదాల జరగకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు మేదరమెట్ల ఎస్ఐ షేక్ మహ్మద్ రఫి తెలిపారు. శనివారం అత్యవసర రన్‌వేపై డివైడర్లకు కాంట్రాక్టర్ సహకారంతో స్టిక్కర్లను అతికించారు. ఇటీవల ఎమర్జెన్సీ రన్‌వేపై డివైడర్‌ను ఢీకొని చాలా ప్రమాదాలు జరిగాయి. పలువురు తీవ్రంగా గాయపడగా, మరికొందరు మృతి చెందారు. ఈ ప్రమాదాల్లో ముఖ్యంగా కార్లలో ప్రయాణిస్తున్న వారు డివైడర్లను ఢీకొట్టారు. రాత్రి వేళలో జరుగుతున్న ఈ ప్రమాదాల అడ్డుకట్టకు నాలుగు కిలో మీటర్ల పొడవున్న డివైడర్‌కు స్టిక్కర్లను ఏర్పాటు చేశారు.



స్టిక్కర్ల ఏర్పాటును పరిశీలిస్తున్న ఎస్ఐ

రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

చినగంజాం, అక్టోబరు 5 : మండలంలోని పెదగంజాం ప్రాంతంలోని ఇసుక భూముల నుంచి అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ ఎస్.రమేష్ శనివారం తెలిపారు. పెదగంజాం ప్రాంతం నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమచారం రావడంతో సిబ్బందితో వెళ్లి బుచ్చిగుంట వద్ద ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీసు స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ట్రాక్టర్ల డ్రైవర్లు అన్నారెడ్డి, వెంకటేశ్వరరావును అరెస్ట్ చేసి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. గ్రామంలో గుర్తు తెలియని వ్యక్తుల నుంచి తక్కువ ధరకు ఇసుకను కొనుగోలు చేసి ఉప్పుగుండూరు గ్రామానికి తరలించి అధిక ధరకు విక్రయిస్తున్నట్లు తెలిపారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు

తీరప్రాంతంలో వాటర్‌ప్లాంట్ ప్రారంభంలో ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, అక్టోబరు 5 : తీరప్రాంత గ్రామాల ప్రజలకు తాగునీటికి ఇబ్బంది లేకుండా పూర్తి స్థాయిలో చర్యలు చేపడతామని ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య చెప్పారు. మండల పరిధిలోని వాడరేవులో లలితానంద ఆశ్రమ పీఠాధిపతి రామానంద సరస్వతి సహకారంతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్, నూతన ట్రాక్టర్‌ను ఎమ్మెల్యే కొండయ్య, రామానంద సరస్వతి ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే కొండయ్య, రామానంద సరస్వతి

ఎమ్మెల్యే కొండయ్యను కలిసిన మున్సిపల్ కమిషనర్

చీరాల, అక్టోబరు 5 : మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన అబ్దుల్ రషీద్ శనివారం ఎమ్మెల్యే ఎంఎం కొండయ్యను మర్యాద పూర్వకంగా కలిశారు. వెంకటేశ్వరస్వామి ప్రతిమను ఎమ్మెల్యేకు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎలాంటి అవినీతి ఆరోపణలకు తావులేకుండా పుర ప్రజలకు మెరుగైన సేవలను పారదర్శకంగా అందించాలని కోరారు.

ఏపీటీడీసీ చైర్మన్ బాలాజీకి కొండయ్య అభినందనలు

చీరాల, అక్టోబరు 5 : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర టూరిజం అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా నూకసాని బాలాజీ శనివారం బాధ్యతులు స్వీకరించారు. ఈక్రమంలో ఎమ్మెల్యే కొండయ్య నూకసాని బాలాజీని కలసి అభినందులు, శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మెల్యేతో పాటు పలువురు చీరాల నియోజకవర్గ టీడీపీ నాయకులు ఉన్నారు.

విశ్రాంత ఉపాధ్యాయుడికి సన్మానం

అద్దంకిటౌన్, అక్టోబరు 5 : అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జానపద కళాపీఠం, శ్రీ దాస భారతీయ జానపద కళా క్షేత్రం ఆధ్వర్యంలో శనివారం విశ్రాంత ఉపాధ్యాయుడు నిమ్మరాజు నాగేశ్వరరావు సన్మానించారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు సేవలు, సేవా కార్యక్రమాలను వక్తలు కొనియాడారు. కవిగా ప్రముఖుల జీవిత చరిత్రలను రాస్తూ అందరి మన్నలను పొందారన్నారు. కార్యక్రమంలో చెన్నుపాటి రామాంజనేయులు, జ్యోతి చంద్రమౌళి, రిటైర్డ్ ఆర్డీడీ డాక్టర్ యూ దేవపాలన, అన్నమనేని వెంకట్రావు, కళాక్షేత్రం అధ్యక్షుడు చెన్నుపల్లి నాగేశ్వరరావు, తాళ్లూరి బాబూరావు, షేక్ మస్తాన్, కోటేశ్వరరావు, పీసీహెచ్ కోటయ్య నాగేశ్వరరావును సత్కరించారు.



నాగేశ్వరరావును సన్మానిస్తున్న సభ్యులు

ఏబీసీకి అరకొరగా నీటి విడుదల

- నేడు మంత్రి పరిశీలన
- అధికారులతో సమీక్ష

అద్దంకి, అక్టోబరు 5 : అద్దంకి బ్రాంచి కాలువ ఆయకట్టులో వరి నాట్లు ముమ్మరంగా ప్రారంభమవుతున్నాయి. అయితే సాగునీటి విడుదల అరకొరగా ఉంది. రెండు రోజుల కిందటి వరకు మరింత తక్కువగా ఉండగా శుక్ర, శనివారాల్లో నీటి విడుదల ఒకింత పెరిగింది. ఇటీవల వరకు ఏబీసీలో బాపట్ల జిల్లా సరిహద్దు 18వ మైలు వద్ద 700 క్యూసెక్కులకు లోపుగానే నీటి విడుదల జరిగింది. శుక్ర, శనివారం మాత్రం 900 నుంచి వెయ్యి క్యూసెక్కుల నీరు విడుదల అవుతోంది. ఏబీసీ హెడ్ వద్ద పూర్తి స్థాయి నీటి విడుదల సామర్థ్యం 2400 క్యూసెక్కులు కాగా, ప్రస్తుతం 1800 క్యూసెక్కులు విడుదల అవుతోంది. బాపట్ల జిల్లా సరిహద్దుకు 1800 క్యూసెక్కుల నీరు విడుదల జరగాల్సి ఉండగా 1200 క్యూసెక్కులకు మించి విడుదల జరగడం లేదు. దీంతో ఆయకట్టు విస్తీర్ణం కూడా క్రమేపీ తగ్గుతోంది. ప్రస్తుతం సుమారు 10వేల ఎకరాలలో మాత్రమే వరి సాగు జరిగింది. కనీసం మరో 20వేల ఎకరాలలో వరి సాగు చేసే అవకాశం ఉంది. ఈ పరిస్థితులలో పూర్తి స్థాయిలో నీటి విడుదల జరిగితేనే వరినాట్లు పడే అవకాశం ఉంది. ప్రస్తుత పరిస్థితులలో నీటి విడుదల తక్కువ జరిగితే నాట్లు మరింత ఆలస్యం అయ్యే పరిస్థితి ఉంది. దీంతో రైతులలో ఆందోళన మొదలైంది. నీటి సమస్యను మంత్రి రవికుమార్ దృష్టికి పలు గ్రామాల రైతులు తీసుకుపోయారు.

నేడు ఏబీసీ 18వ మైలు వద్ద మంత్రి సమీక్ష

అద్దంకి బ్రాంచి కెనాల్ 18వ మైలు సంతమాగులూరు మండలం అడవిపాలెం సమీపంలో ఆదివారం ఉదయం 10-45 గంటలకు ఎన్ఎస్‌పీ అధికారులతో కలిసి మంత్రి గొట్టిపాటి రవికుమార్ పరిశీలించనున్నారు. అనంతరం అక్కడే అధికారులతో సమీక్ష చేయనున్నారు. 11-45 నుంచి పుట్టావారిపాలెం గెస్ట్ హౌస్ వద్ద సంతమాగులూరు మండల నేతలు, కార్యకర్తలకు మంత్రి రవికుమార్ అందుబాటులో ఉండనున్నారు.

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

అద్దంకి, అక్టోబరు 5 : దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి అద్దంకిలోని పలు దేవాలయాలలో అమ్మవార్లను పలు రూపాల్లో అలంకరించారు. చక్ర సహిత వాసవీ కన్యకాపరమేశ్వరి దేవాలయం లో అమ్మవారిని శనివారం లలితాదేవిగా అలంకరించారు. దత్తపాదుకా క్షేత్రంలో గాయత్రీగా, శింగరకొండ లోని గాయత్రీ పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అన్నపూర్ణగా అలంకరించారు. ఆయా దేవాలయాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



చీరాలలో అన్నపూర్ణగా



అద్దంకి : లలితాదేవిగా కన్యకాపరమేశ్వరి

అన్నపూర్ణదేవిగా వాసవీమాత

చీరాల : సంతబజారులో వేంచేసియున్న వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో అమ్మవారు అన్నపూర్ణదేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. బాల భక్త సమాజం వారు భక్తి గీతాలను ఆలపించారు.

గాయత్రీ దేవిగా

కారంచేడు(పర్చూరు) : కారంచేడు గ్రామంలోని శ్రీ వైష్ణవి దుర్గాలయంలో విజయ దశమి శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంతం వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల వేడుకల్లో భాగంగా శనివారం అమ్మవారిని శ్రీ గాయత్రీ దేవిగా అలంకరించి ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో ప్రతిరోజు సాంస్కృతిక, భజన కార్యక్రమాలు నిర్వహిస్తూ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు.

శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శనివారం శ్రీ అన్నపూర్ణాదేవి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఉత్సవాల్లో భాగంగా మండలంలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరుగుతున్నాయి. శ్రీ అద్దంకి నాంచారమ్మ ఆలయంలో అమ్మవారిని ఆలయ అర్చకులు తులసి రామాంజనేయులు సారథ్యంలో శ్రీ అన్నపూర్ణాదేవిగా అలంకరించి ప్రత్యేక పూజ లు నిర్వహించారు. శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు శ్రీరాం వెంకటసుబ్బారావు ఆదర్యంలో ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహి స్తున్నారు.



కారంచేడులో గాయత్రీ మాతగా

చినగంజాం : మండలంలోని పలు దేవాలయాలలో దసరా పండుగను పురస్కరించుకుని దేవి శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. అమ్మవారు వివిధ అలంకారాల్లో దర్శనమిచ్చింది. భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపారు. శనివారం రైల్వే సెంటర్ భవానీపురంలోని విజయకనకదుర్గాభవాని దేవస్థానంలోని అమ్మవారిని అన్నపూర్ణాదేవి అవతారంలో, చినగంజాం వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి మందిరంలోని అమ్మవారిని గజలక్ష్మీ దేవి అలంకారంలో, సోపిరాల రామకోటేశ్వర స్వామి దేవస్థానంలో లలితాపరమేశ్వరి అమ్మవారిని శాకాంబరీదేవి అవతారంలో అలంకరించి భక్తులకు ధర్శనం కల్పించారు. భూ సమేత భావనారాయణస్వామి ఆలయంలో 17వ వార్షిక బ్రహ్మోత్సవాలల్లో భాగంగా శ్రీవారికి, అమ్మవార్లకు శనివారం ఉదయం విశేష పూజలు, విశేష హోములు నిర్వహించారు. తదనంతరం ఆలయప్రాంగణంలో మహిళా భక్తులు విష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణ కార్యక్రమాన్ని నిర్వహించారు. రాత్రికి గ్రామోత్సవంలో హనుమద్వాహనంపై శ్రీవారు భక్తులకు దర్శనమిచ్చారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు, ఆలయ సేవాదళ్ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇంకొల్లు : కృష్ణమందిరంలో అమ్మవారిని శనివారం శ్రీఅన్నపూర్ణాదేవిగా అలంకరించారు. ఉభయదాతలు పొన్నగంటి జానకిరామారావు, నాగరాజ దంపతులు పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.



హనుమ వాహనంపై భావనారాయణస్వామి



ఇంకొల్లు : అన్నపూర్ణగా అమ్మవారు

సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్

చీరాల, అక్టోబరు 5 : ప్రభుత్వ పరంగా అందిస్తున్న సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్ అన్నారు. స్థానిక గంజిపాలెంకు చెందిన శ్రీరామ్ బాలాజీరావు అనారోగ్యంతో బాధపడుతున్న క్రమంలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య ద్వారా సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేసుకున్నారు. సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి ఎమ్మెల్యే కొండయ్య చొరవతో రూ.1,50,000 మంజూరయ్యాయి. శనివారం రూ.1.50 లక్షల చెక్కులను టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి డాక్టర్ మహేంద్రనాథ్ లబ్ధిదారునికి అందజేశారు.



చెక్కును అందజేస్తున్న డాక్టర్ మహేంద్రనాథ్

ఇసుక అక్రమ తవ్వకాల ప్రదేశాలను పరిశీలించిన అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

వేటపాలెం(చీరాల), అక్టోబరు 5 మండల పరిధిలో పందిళ్లపల్లి, రామన్నపేట తదితర ప్రాంతాల్లో ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా చేసిన ప్రాంతాలను మైనింగ్, రెవెన్యూ అధికారులు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ తవ్వకాలు జరిగిన ప్రదేశాల్లో ఏ మేరకు తవ్వకాలు జరిగాయో లెక్కించి బాధ్యులకు అపరాధ రుసుము వేస్తామన్నారు. అలానే అక్రమ తవ్వకాలకు సంబంధించిన పట్టాదారులను కూడా గుర్తించి అవసరమైతే పట్టాలను రద్దు చేసేందుకు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు. ఎవరు కూడా అనుమతులు లేకుండా ఇసుక అక్రమ తవ్వకాలు, రవాణా చేస్తే తగిన చర్యలు తప్పవని అధికారులు తెలిపారు.